


# ప్రముఖాంధ్ర

**ప్రపంచ తెలుగుల మానస పత్రిక**

ఏప్రియల్ 2019

సంపుటి : 25 **292** సంచిక : 4




# భారతదేశ పురోగమనానికి హిందూత్వమే శరణం!

భారతీయత, హిందూత్వంలోని ఔన్నత్యాన్ని గానీ, ఔదార్యాన్ని గాని నేటి రాజకీయ వ్యవస్థా, అధిక శాతం ప్రజలూ గ్రహించకపోవడం వల్లనే హిందూత్వంపై ద్వేషాన్ని పెంచుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం హిందూత్వాన్నీ ఒక మతంగా పరిగణిస్తూండడమే! హిందూత్వాన్ని ఒక సర్వజన సుఖైక జీవన ధర్మంగా గ్రహించి ఉంటే ఈ ద్వేషం ప్రబలేది కాదు. ప్రతీ అవివేకి నోటివెంటా 'మతతత్వం' అనే మాట వెలువడేది కాదు.

మానవ సమాజానికే సుఖజీవనం, ధర్మప్రవర్తనం, సత్యసంపదలను నేర్పినదొక హిందూ ధర్మమే. నోరున్న మనిషి నుంచీ, నోరు లేని పశుపక్ష్యాది కీటకాలనూ, స్థిర జడములుగా ఉండే వృక్ష, పర్వతములనూ, ప్రవహించే నదీ, నద, సాగరాలనూ పూజించి, గౌరవించే సంస్కారాన్ని నేర్పినది, వేద సంస్కృతీ పరమైన హిందూ ధర్మమే. పాంచ భౌతికమైన ఈ శరీరం పంచభౌతిక ప్రకృతితో ముడిపడి ఉన్నదనే సత్యాన్ని శాస్త్రం (సైన్సు)గా నిరూపించింది, నిర్ధారించి ప్రపంచానికి శాస్త్ర బోధకురాలైంది.

భారత రాజ్యాంగ రచనా సంస్కర్తలైన, అంబేద్కర్ అయినా, గాంధీయైనా, నెహ్రూయైనా – మరో బౌద్ధ, జైన, సిక్కు మత స్థాపకులైన బుద్ధ, మహావీర, నానక్‌లైనా మానవత్వంలోని మహత్తరమైన సమానత్వం, పరస్పరావగాహనతో బాటు పరస్పర సహకార గుణం స్వభావం కలిగే సమాజాన్ని హిందూత్వం తీర్చిదిద్ద గలిగిందంటే అది వేల యేండ్లుగా వస్తూన్న వేద ప్రభావిత (వేద ప్రజ్వలిత) సనాతన ధర్మ ప్రభావ ప్రసాదితమే!

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో మతప్రాతిపదికగా ముస్లిము సోదరులు పాకిస్తాన్ గా విడివడి, తమ మత సాంస్కృతికపర దేశంగా ఏర్పడగా, శేషించిన మన దేశం హిందూ ధర్మ దేశం గాకుండా సోదర మతస్థులందరినీ తన అక్కున చేర్చుకున్న సెక్యులర్ దేశమైంది. సమాన గౌరవ ప్రతిపత్తులనిచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్న ప్రపంచాగ్ర గురుస్థాన దేశంగా రూపొందింది.

సర్వమత సమానత, సహన సౌశీలత, తాత్విక చింతన, ధార్మిక భావన, పరస్పర సహకార వృత్తుల కారణంగానే సహజీవనం ఏర్పడింది. కలహాలు లేని నిత్య మనుగడ నేర్పరచుకున్న దేశంగా భారతదేశం వర్ధిల్లింది. స్వాతంత్ర్యం ఏర్పడిన పిదప రాజ్యాంగ రచనాకర్తలు కూడా, మౌలికమైన సూత్రాలు గల సనాతన ధర్మాన్నే మార్గంగా చేసుకుని భారత రాజ్యాంగ రచన చేశారు. పచ్చని కాంతుల్ని తనపై పరుచుకున్న భూదేవి పసిడి పంటలనిస్తూ, భూజనుల ఆకలిదప్పులను తీరుస్తూంటే, పౌరుల ముఖబింబాలు వేయి శరత్ చంద్రుల చంద్రికా ధవళ కాంతులు కురిపించిన చందంగా సుఖసంతోషాలతో విలసిల్లుతున్న దేశం, హిందూ దేశమని విదేశీ పర్యాటకులు విశ్లేషించారు. ప్రయాణం చేసి అలసి సొలసిన నత్త తన దేహాన్ని గుల్లలోకి చేర్చి విశ్రమించినట్టు, పగలంతా కష్టించిన జనం, రాత్రి తమ తమ గృహాల్లో శాంతి సుఖాలతో తలదాచుకుంటూ సుఖజీవనం సాగించారు కాబట్టే, మనదేశం 'శ్రీ'లు చెందిన భారతదేశంగా శాంతిధామంగా వర్ధిల్లింది.

మనం చేసే పనిని నిష్కామంగా చేయాలనీ, ఫలాపేక్ష రహితంగా ఉండాలనీ, మంచి పనులను చేసేవారిని ఆదర్శంగా తీసుకుంటూ, వారి మార్గంలో నడచిన నాడు అసూయా ద్వేషాలకు తావు లేని సమసమాజం ఏర్పడుతుందనెడి భావంతో రాజ్యాంగ రచన చేశారు. సర్వమత సమైక్యత, సమాన ప్రతిపత్తి, అందరూ ఒకటేననే సమభావం వర్ధిల్లుతుందనీ, హెచ్చుతగ్గులు లేని సమభావన కలుగుతుందని పెద్దలు భావించారు.


రాగద్వేషాల కతీతంగా మనసు కలిగి ఉండాలి. సమస్త ప్రాణులకూ ఉపకారం చేయాలి. అహింసా విధానాన్ని 'తూ.చ.' తప్పకుండా పాటించాలి. క్రౌర్య, కాఠిన్య, ద్వేష భావాల్ని విడనాడాలి. పరోపకారాన్ని పరమధర్మంగా భావించాలి. తాను చేసుకున్న పుణ్యమే తనను రక్షిస్తుందనెడి భావంతో పుణ్య కార్యాలనే చేయాలి. అనన్య భక్తితో తమ తమ ఆరాధ్య దైవాలను ఆరాధించాలి. ఆరాధనలో శాంతి ఉన్నదన్నదే హైందవ మూల సిద్ధాంతం. అలాంటి హైందవత్వాన్ని, మతతత్వంగా భావించి తిరస్కరించడం మూర్ఖత్వమవుతుంది.

'జైహింద్', 'వందేమాతరం' అనే నినాదాలతో భారతీయులందరూ స్వాతంత్ర్య నినాదం చేశారు. బ్రిటిష్ కొరడాలకు, తుపాకీ గుళ్ళకు రక్తార్పణం చేశారు. విభేదాలను సృజించి, జనవిభజనం కావించకుండా సమైక్యతా మూర్తులైన యువతకు మార్గనిర్దేశం చేశారు. రాజకీయ నాయకులు పరస్పర దూషణం విడనాడి దేశాభివృద్ధిపై దృష్టిని సారించిన నాడు స్వతంత్ర భారత పూర్ణ ఫలాలను అందుకోగలం. ఆ శుభదినం కోసమే ఎదురుచూద్దాం. భారతదేశ పురోగమనానికి హిందూత్వమే శరణ్యమనే సత్యాన్ని గ్రహిద్దాం.

*బుధజన విధేయుడు*

*– గోటేటి శ్రీరామారావు*

**(జూన్ 2005 ప్రముఖాంధ్ర)**




Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# నవరస 'కవనా' సార్వభౌముడు

భావరాజు పద్మిని

(క్రితం నెల వ్యాసానికి కొనసాగింపు)

సిరివెన్నెల గారి పాటలు మనల్ని ఆలోచనల్లో పడేసే ప్రశ్నలు. తన పాటల్లోని మాటల మాయాజాలంలో ఉన్న అంతరార్థాన్ని సామాన్యుడు శోధించాలని, శోధించి సమస్య మూలాలను గుర్తించాలని, తద్వారా తన గమ్యమేమిటో నిర్ణయించుకుని అనుకున్నది సాధించాలని, ఆయన కోరికేమో గాని... ఈ పాటలు నిశ్చయమైన పరమార్థం ఉన్న పాటలని మనం చెప్పవచ్చు. వారి పాటల గమ్యం మన మనసు, ఆలోచనలు, వీటిని మలచుకోవడం ద్వారా మనలో వచ్చే పరివర్తన!

"ప్రశ్నలోనే బదులు ఉంది గుర్తుపట్టే గుండెనడుగు" అంటారు సిరివెన్నెల గారు, గమ్యం చిత్రంలోని టైటిల్ సాంగ్‌లో. మనం నిరాశకు అపజయానికి గురైనప్పుడు మనతో మనం మాట్లాడుకోము. బయట ఉండే అంశాలు లేక వ్యక్తులు, సమాజం ఇలా మన వైఫల్యానికి ఏదో కారణమని, క్రుంగిపోతూ ఉంటాము. అటువంటి సమయంలో 'ఎందుకిలా జరిగింది' అని మనల్ని మనం ప్రశ్నించుకుంటే, జవాబు మన హృదయంలోనే (హృదయంలో ఉండే అంతరాత్మ రూపంలో) ఉంటుంది. నైరాశ్యానికి గురైన సమయంలో మాత్రమే కాదు, జీవితంలోని ఏ క్షణంలోనైనా సరే, మనల్ని మనం ప్రశ్నించుకుంటే, సమాధానం దొరకని ప్రశ్నే ఉండదు. ఇదే విషయాన్ని అనేకమార్లు, అనేక పాటల్లో మనకు చెబుతూ ఉంటారు ఆయన.

**6. భయానకం :**

ఒక్కోసారి మనల్ని భయపెట్టే సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కాని ఆ భయానికి మలిదశ తెగింపు. భయం ఒక సమస్యకు సమాధానం కాలేదేమో కాని, దాన్నుంచి పుట్టే తెగింపు మాత్రం నిశ్చయంగా ఆ భయాన్ని మొదలంటా నరికేసే ధైర్యాన్ని మనకు ఇస్తుంది.

1988 లో వచ్చిన 'కళ్ళు' చిత్రంలో సిరివెన్నెల గారి 'తెల్లారింది లెగండోయ్' అనే పాట ఒక ఆణిముత్యం. మనలో చాలామందికి చీకటి అంటే భయం ఉంటుంది. కాని, కళ్ళు లేకపోవడంతో ఆ చీకట్లోనే బ్రతుకు గడపాల్సిన జీవితాలు ఈ సినిమాలో పాత్రలుగా మనకు కనిపిస్తాయి. కళ్ళు లేనప్పుడు పగలేంటి, రాత్రేంటి, రెండిటికీ ఉన్న తేడా ఏమి తెలుస్తుంది? కాని నిశితంగా పరిశీలిస్తే, ఈ పాట ఆ కళ్ళు లేని వాళ్ళ కోసం కాదు, కళ్ళుండీ, మనలా భయానికో, పోరాటానికో జడిసి, కళ్ళు మూసుకున్న వారి కళ్ళు తెరిపించడానికి ! ఈ పాట చూద్దాము...

**"పాములాంటి సీకటి పడగ దించి పోయింది**
**భయం నేదు భయం నేదు నిదర ముసుగు తీయండి**
**సావు లాటి రాతిరి సూరు దాటి పోయింది**
**భయం నేదు భయం నేదు సాపలు సుట్టేయండి**
**ముడుసుకున్న రెక్కలిడిసి పిట్ట సెట్టు ఇడిసింది**
**మూసుకున్న రెప్పలిడిసి సూపు లెగరనీయండి"**

భయం లేదు. తెల్లారింది. పాములాంటి చీకటి పడగ దించి వెళ్ళిపోయింది, చావు లాంటి రాత్రి చూరు దాటి వెళ్ళింది. పిట్ట కూడా తన ముడుచుకున్న రెక్కలు విప్పి చెట్టును విడిచింది. తెల్లారింది లెగండి. మంచాలు దిగండి. చమటే చమురుగా సూర్యుడినే వెలిగించాలి, అగ్గిపూలు పూయించాలి. లేవండి. కాలం కట్టిన గంతలు దీసి, కాంతుల ఎల్లువ గంతులు వేసేలా చెయ్యాలి. ఏకువ శక్తుల కత్తులు దూసి రేతిరి మత్తును ముక్కలు చెయ్యాలి... అంటూ సాగే ఈ సందేశాత్మక గీతాన్ని స్వయంగా సిరివెన్నెల గారే పాడడం ఒక విశేషం.

ఇటువంటిదే స్వయంకృషి చిత్రంలోని 'నమ్మకు నమ్మకు ఈ రేయిని' అనే పాట. కలలతో వలలు వేసే చీకటిని నమ్మకు. ఇది నిన్ను ఇక్కడ జరిగే వాస్తవాలను చూడనివ్వదు... కాని, "పుడమిని చూడని కన్ను నడపదు ముందుకు నిన్ను నిరసన చూపకు నువ్వు ఏనాటికి" అంటూ సందేశం ఇస్తారు.

ఇదే తీరులో సాగే పాట క్షణక్షణం చిత్రంలోని 'జాముురాతిరి జాబిలమ్మ' అనే పాట. నట్టడవిలో చిక్కుకున్న నాయికను 'మనసులో భయాలన్నీ మరచిపో...' అని ఊరడిస్తూనే, 'చిటికెలోన చిక్కబడ్డ కటికచీకటి, కరిగిపోక తప్పదమ్మ ఉదయ కాంతికి' అంటూ ఈ చీకటిలాగే జీవితంలో నీకు ఎదురైన కష్టాలు కూడా కరిగి పోతాయి, అంటూ సందేశం ఇస్తారు. ఇలా భయం వేసినప్పుడు ధైర్యాన్ని ఇచ్చే ఆయన పాటలు ఎన్నో !

**7. బీభత్సం :**

సాధారణంగా భీభత్స రసం కలిగించే భావన జుగుప్స. మనకు ఇష్టంలేని, వ్యక్తి, ప్రాణి, వస్తువు, చోటు... ఇటువంటివి తారస పడినప్పుడు మనకు కలిగేదే జుగుప్స. దీనికి కారణం మనలో ఆ అంశం పట్ల ఉన్న అంతర్లీనమైన భావన. కాని, మన ప్రమేయం లేకుండా సమాజంలో ఎన్నో భీభత్సాలు జరుగుతూ ఉంటాయి. అవి మనలోని మనిషితనాన్ని చంపేసినప్పుడు... ఇవిగో ఇలాంటి సిరివెన్నెల గీతాలే మనకు కర్తవ్య బోధ చేస్తాయి.

అనుకోకుండా నాయిక అత్యాచారానికి గురైంది. ఆ విషయం ఊర్లో అందరికీ పొక్కిపోయింది. ఇంకేం, దొరికిందే సందు... ఆమెను పురుగును చూసినట్లు చూడడం, అసహ్యించుకోవడం మొదలుపెట్టారు. అప్పుడే ఇలాంటి పాట పుట్టింది.

'నువ్వేమి చేసావు నేరం, నీకెక్కడంటింది పాపం, చినబోకుమా!' అని ధైర్యం చెబుతూనే... 'స్త్రీల తనువులోనే శీలమున్నదంటే,

పురుష స్పర్శతోనే తొలగిపోవునంటే, ఇల్లాళ్ళ దేహాలలో శీలమే ఉండదనా? భర్తన్నవాడెవడు పురుషుడే కాదు అనా?

శీలం అంటే గుణం అనే అర్థం...' అంటూ మన కళ్ళు తెరిపిస్తారు. ఇటువంటి పాట రాయడానికి, సమాజంలో అనాదిగా ఉన్న అనాచారాన్ని ఈ విధంగా ప్రశ్నించడానికి ఎంత గొప్ప సంస్కారం కావాలి చెప్పండి !

'సత్య అసత్యాలకు మధ్య నిత్య కురుక్షేత్రం, బాట చూపు భగవద్గీతే అవినీతిని బోధిస్తే, భగవానుడి రథసారధ్యం పాపం వైపే నడిపిస్తే

దోషి ఎవ్వరు..నిర్దోషి ఎవ్వరు – దోషి– నిర్దోషి' ఆలోచించు... అలోచించి ప్రవర్తించు... అంటారు దోషి-నిర్దోషి సినిమాలోని పాటలో.

ఇది అవనికి ఆఖరు కాలం... కలికాలం... కాబట్టి ఇప్పుడు అరాచకాలు ఇలాగే జరుగుతాయి... ఇక్కడ మనిషి మృగంగా మారిపోయాడు, కనుక ఇప్పుడు జరిగే భీబత్సాలు ఎలా ఉన్నాయో, 'కలికాలం' చిత్రంలోని ఈ టైటిల్ సాంగ్ లో చెప్పారు సిరివెన్నెల గారు.

**"మనిషే మృగమై అడవైపోయే నడివీధిలో,**
**కూరిమి కోరని క్రౌర్యం..యుగసారం**
**ఓరిమి చేరని వైరం..గ్రహచారం,**
**కత్తులు నూరే కర్మాదానం**

**నెత్తురు పారే అత్యాచారం, కసికాలం..రక్కసికాలం,**
**కలికాలం ఆఖరి కాలం"**

నేడు సమాజంలో నడిరోడ్డు మీద మనిషిని మనిషి నరికి చంపుతున్న సంఘటనలు చూస్తున్నాము. అటువంటి ఒక సమస్యను ఎత్తి చూపడమే కాదు, పరిశీలిస్తే, వాటికి సమాధానాన్ని కూడా ఇస్తాయి, సిరివెన్నెల గారి పాటలు. పై వాక్యాలను చూస్తే... క్రౌర్యం(కోపం) కూరిమిని(స్నేహాన్ని) కోరట్లేదు, వైరం (శత్రుత్వం) ఒరిమిని నీ దగ్గరకు చేరనివ్వట్లేదు... అందుకే కత్తులు నూరి, నెత్తురు పారేలా చేస్తున్నావు. నీవల్ల నడివీధి అడవిగా మారిపోయింది. మరి దీనికి పరిష్కారం... ఇవే వాక్యాలను తిరగేసి చదివితే వస్తుంది. ఓ మృగమా, నువ్వు మరిచావేమో, నువ్వు జంతువువు కాదు, మనిషివి. అందుకే నీలో చెలిమిని, ఒరిమిని, పెంచుకుని, తిరిగి, మనిషివైపో... ఇంత గొప్పగా ఉంటాయి సిరివెన్నెల గారి పాటలు.

**8. రౌద్రం :**

రౌద్ర రసం ప్రకటించే భావం కోపం. ఈ కోపాన్ని ప్రకటించే సందర్భంలో సిరివెన్నెల గారి అక్షరాలు నిప్పు కణాల్లా రగిలిపోతాయి.

కోపాన్ని ప్రకటించే సిరివెన్నెల గీతం అనగానే మనకు వెంటనే స్ఫురణకు వస్తుంది గాయం సినిమాలోని ఈ పాట. ఇందులో సిరివెన్నెల గారు నటించడం ఒక విశేషం.

**"నిగ్గ దీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని, అగ్గితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని**
**గాలివాటు గమనానికి కాలిబాట దేనికి? గొర్రెదాటు మందకి మీ జ్ఞానబోధ దేనికి?**
**యే చరిత్ర నేర్చుకుంది పచ్చని పాఠం, యే క్షణాన మార్చుకుంది జిత్తుల మార్గం?**
**రామబాణమార్పిందా రావణ కాష్ఠం, కృష్ణ గీత ఆపిందా నిత్య కురుక్షేత్రం?**
**వేట అదే వేటు అదే నాటి కథే అంతా, నట్టడవులు నడివీధికి నడిచొస్తే వింతా**
**బలవంతులె బ్రతకాలని సూక్తి మరవకుండా, శతాబ్దాలు చదవలేదా ఈ అరణ్యకాండ**
**మారదు లోకం, మారదు కాలం..."**

ఈ పాట నేటికీ వర్తిస్తుంది. ఎందుకంటే, అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు ఏమీ మారలేదు. ఈ పాట గురించి ఇలా చెబుతారు సిరివెన్నెల గారు.

"భయం వెయ్యాలని అప్పట్లో ఆ పాట రాశాను. కానీ, ఇప్పుడు భయం మోతాదు మించిపోయింది. భయపడుతూ బతకడం కంటే.. చచ్చి బతికిపోదామనే పరిస్థితి. అందుకే ఇప్పుడు రాస్తే.. "శతకోటి సమస్యలను ఎదుర్కొనేందుకు.. బతికి ఉండగల సాహసానివై పరుగులు తియ్యి" అని రాస్తాను."

ఇదే సినిమాలో "సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకనీ" అన్న పాట సిరివెన్నెల గారికి ముచ్చటగా మూడో నందిని తెచ్చి పెట్టింది. ఇటువంటిదే సింధూరం చిత్రంలోని "అర్థ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా?" అనే పాట. ఈ పాట సిరివెన్నెల గారికి నాలుగవ నందిని ఇచ్చింది.

"స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందో కాదు, అసలు ఎందుకు పోయిందో ఆలోచించండి, అప్పుడే మీకు సమాధానం దొరుకుతుంది," అంటారు ఆయన. ఇప్పటిదాకా మనం సాధించిన స్వాతంత్ర్యంతో ఏమి సాధించాము? ఏమి సాధించాలో, పొందినదాన్ని ఎలా నిలబెట్టుకోవాలో... ఆలోచిస్తే, మన అంతరంగమే, మనకు కర్తవ్య బోధ చేస్తుంది.

**"భగభగమని ఎగసిన మంటలు ఏ కాంతి కోసమో.. ధగధగమని మెరిసిన కత్తులు ఏ శాంతి కోసమో..**
**ఏ పంటల రక్షణకీ కంచెల ముళ్ళు? ఏ బ్రతుకును పెంచుటకీ నెత్తుటి జల్లు?**
**ఏ స్నేహం కోరవు కయ్యాల కక్షలు? ఏ దాహం తీర్చవు ఈ కార్చిచ్చులు?"**

అంటూ ఈ మధ్యన కంచె చిత్రం కోసం సిరివెన్నెల గారు రాసిన పాట పెద్ద దుమారమే రేపిందని చెప్పవచ్చు. అప్పటికీ ఇప్పటికీ ఆయన కలం పదునుదేరిందే కాని, ఆ పదాలలో వాడి, వేడి ఏ మాత్రం తగ్గలేదని, పై పాటలను చూసి మనం చెప్పవచ్చు.

**9. శాంతం :**

శాంత రసం లోని భావం ఓర్పు. స్త్రీ సహనానికి, ఓర్పుకు మారుపేరు అంటారు. అందుకే అనాదిగా స్త్రీ సహనాన్ని భూదేవితో ఒక పోల్చే అలవాటు ఉంది. అలా మహిళల గురించిన పాటలు రాయాల్సి వచ్చినప్పుడు 'ఆడదే ఆధారం' అనే సినిమాలో టైటిల్ సాంగ్ ను, మహిళలూ మహారాణులూ అన్న పాటను అద్భుతంగా రాసారు సిరివెన్నల గారు. స్త్రీని మన శాస్త్రాల్లో అగ్నితో పోల్చారు... ఈ అగ్ని జీవితాల్ని వెలిగించనూ కలదు, రగిలించనూ గలదు. అలా రెండు విధాలుగా పనిచేసిన చారిత్రిక కథనాలను ఈ పాటల్లో ఆయన పొదిగారు.

సరిగ్గా ఇటువంటి భావాన్నే 'ఆలయాన హారతిలో..ఆఖరి చితిమంటలలో... రెండింటిలో నిజానికి ఉన్నది ఒకటే అగ్ని గుణం, దీపాన చూపెడుతుందో, తాపాన బలిపెడుతుందో... ఏ క్షణాన ఎలా మారునో ఈ ప్రేమగుణం' అంటారు సుస్వాగతం చిత్రంలోని ఈ పాటలో. తన ప్రేమ పండుతుందో లేదో తెలియని నాయకుడి మనోవేదనను ఇందులో హృద్యంగా ఆవిష్కరిస్తారు.

అమ్మ రాజీనామా చిత్రంలోని 'ఎవరు రాయగలరు' అన్న పాట, అమ్మ గొప్పదనాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన పాట. 'అవతార మూర్తైనా అమ్మ పేగు తెంచుకు పుట్టల్సిందే... అమ్మేకదా వాళ్ళనైనా కనగలిగేది, అమ్మే కదా అటువంటి మరొక అమ్మను కూడా కనగలిగేది '... ఇంత గొప్ప మాటలు ఆయన కలం నుంచి జాలువారిన తియ్యటి ఊటలు.

ఒక్కోసారి జీవితం విసిరే సవాళ్ళను ఎదుర్కోలేక, ఓర్పును కోల్పోయి, నిరాశ పడిపోతాము. అటువంటి నైరాశ్యం నిండిన బ్రతుకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే స్ఫూర్తిదాయకమైన గీతాలు రాయడంలో సిరివెన్నెల గారికి సాటి ఎవరూ లేరనే చెప్పవచ్చు. ఆవిడే శ్యామల అనే చిత్రంలో 'ఓ గమ్యమున్న చరణం, ఇది సవ్యమైన చలనం ' అనే పాట ఇందుకొక ఉదాహరణ.

ఒక్కోసారి మనకు సాయం ఎవరూ లేరని భావిస్తూ, ఓపిక నశించి, దిగాలు పడిపోతూ ఉంటాము. కాని... ఆలోచిస్తే, మన సైన్యం మనలోనే ఉంది. ఏమిటా సైన్యం? "దేహముంది, ప్రాణముంది, నెత్తురుంది, సత్తువుంది, ఇంతకన్న సైన్యముండునా ?" ఈ వాక్యాన్ని తలచుకున్న ప్రతీ సారి మనలో కొత్త స్ఫూర్తి కలుగుతుంది.

ఈ వాక్యం 'పట్టుదల' అనే చిత్రం కోసం ఆయన రాసిన 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి' అనే పాటలోనిది. ఎస్.బి.ఐ. లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీ వారు తెలుగు రాష్ట్రాలకు ఈ పాటను తమ ప్రాంతీయ గీతంగా పెట్టుకున్నారు. ఈ పాట విని ఎంతో మంది విద్యార్థులు స్ఫూర్తిని పొందారు. తమ గమ్యం వైపు సాగిపోయారు.

**"అలలుండని కడలేదని అడిగేందుకు తెలివుందా?**
**కలలుండని కనులేవని నిత్యం నిదరోమందా?**
**గతముందని గమనించని నడిరేయికి రేపుందా?**
**గతి తోచని గమనానికి గమ్యం అంటూ ఉందా?"** – నీ ప్రశ్నలు నీవే ఎవ్వరూ బదులివ్వరుగా... అంటూ ఈ పాటను 'కొత్త బంగారు లోకం చిత్రం కోసం రాసారు.

రాసే ప్రతి గీతంలో విలువైన పదాలను పొదిగి, ఆ గీతానికి విలువ ఇవ్వడం సిరివెన్నెల గారికే చెల్లింది. అంకురం చిత్రంలోని 'ఎవరో ఒకరు ఎపుడో అపుడు' అనే పాట, 'పట్టుదలతో చేస్తే సమరం, తప్పకుండా నీదే విజయం...' అనే సంబరం చిత్రంలోని పాట, 'సాహసం శ్వాసగా సాగిపో సోదరా' అనే ఒక్కడు చిత్రంలోని పాట, ఈ కోవకు చెందుతాయి.

సిరివెన్నెల గారిలో మరో గొప్ప ప్రత్యేకత ఏమిటంటే, క్లబ్ సాంగ్స్, ఐటెం సాంగ్స్ ని కూడా అత్యంత సంస్కారవంతంగా రాయడం. ఇందుకు అంతం సినిమాలోని "ఎంతసేపైన ఎదురుచూపేన నాగతి " అన్న పాట ఒక ఉదాహరణ. అలాగే జోల పాటల్లో కూడా ఆయన ముద్ర తిరుగు లేనిది. స్వాతిముత్యం లోని 'లాలీ లాలీ ...' పాట మొదలుకుని, 'హాయి హాయి వెన్నెలమ్మ హాయి' అన్న తారక రాముడు చిత్రంలోని పాట దాకా, మనల్ని జోకొట్టి నిద్ర పుచ్చిన జోల పాటలు ఎన్నో.

"ప్రకృతి ఎన్ని రకాలుగా ఉంటుందో చెప్పగలిగే సహజ లక్షణం మనిషికి మాత్రమే ఉంది. అవన్నీ చూపించకపోతేనే తప్పు. మనిషి శరీరంలో ప్రతి అవయవం పనిచేయాలి. అందులో ఒక్కటి పనిచేయకపోయినా... 'వికలాంగుడు' అంటారు. ఇలాగే నవరసాలు కూడా." అంటారు సిరివెన్నెల గారు.

ఈ మధ్యన పద్మశ్రీ వచ్చినప్పుడు ఒక పత్రికతో ఆయన చెప్పిన మాటలు, ఆయన ఔదార్యాన్ని తెలుపుతాయి.

"మెడల్ కోసం మెడలు వంచడం నాకు చేతకాదు. అయినా, పద్మశ్రీ కోసం నేను పాటలు రాయలేదు. దాని మీద నాకు ఆసక్తి కూడా లేదు. ఇంతమంది అభిమానాన్ని పొందగలిగాను. ఇన్ని కోట్లమందికి కుటుంబ సభ్యుణ్ణి కాగలిగాను. 'జగమంత కుటుంబం నాది' అని ఓ పాట రాశాను. తాము రాసిన పాట ఎంతమంది రచయితల జీవితాల్లో నిజమయ్యాయంటారు? నాకు మాత్రం నిజమైంది. ఇప్పుడు నాది 'జగమంత కుటుంబం'... ఇంతకంటే గొప్ప అవార్డు ఇంకేదైనా ఉంటుందా?"

సిరివెన్నెల గారు... ఈ జగమంత కుటుంబం మీకు జేజేలు పలుకుతోంది. తెలుగు భాష సగర్వంగా తలెత్తుకునేలా చేసిన ఈ పుంభావ సరస్వతికి, ప్రతి తెలుగు గుండె శిరస్సు వంచి ప్రణమిల్లుతోంది. మీరు సంధించిన అక్షరాల శరాలు, పలికించిన భావాల పరిమళాలు, పండించిన నవరసాల నయగారాలు, మా మనస్సులో ఎప్పటికీ పదిలమే సుమా! సాహో, నవరస కవనా సార్వభౌమా! ●




# సాయి దత్తపీఠం, సౌత్ ప్లైన్‌ఫీల్డ్, న్యూ జెర్సీ

## మానవత్వం పరిమళించిన చోటు.. సేవా భావం పరిఢవిల్లిన చోటు.. దైవం మానవ రూపంలో నడయాడిన చోటు.. షిరిడీ..

సాటి మనిషిలోనే దేవుడిని చూడమని చెప్పిన ఆ షిరిడీనాథుడు... కోట్లాది భక్తులకు ఆరాధ్యుడయ్యాడు... అన్ని మతాల వారు కొలిచే దేవుడయ్యాడు... దైవమంటే కేవలం భక్తి, భజనలు మాత్రమే కాదు..

**దైవమంటే సేవ..**
**దైవమంటే సత్సంగం..**
**దైవమంటే అన్నదానం...**
**దైవమంటే స్వచ్ఛంద సాయం...**

ఈ నాలుగే షిరిడీ సాయి చెప్పిన దైవత్వానికి మూలస్థంభాలు.. దైవాను గ్రహానికి ఈ నాలుగే కీలకం. ఆ సాయినాథుడి కరుణా కటాక్షాలను పొందాలంటే మనం ఈ నాలుగు ఆచరించాలి... ఇదే అసలైన సాయి తత్వం.. ఈ తత్వాన్ని అమెరికాలో కూడా అనంత ప్రవాహంలా కొనసాగించేందుకు నడుం బిగించారు.. శ్రీ రఘుశర్మ శంకరమంచి..

శివరాత్రి నాడు లింగోద్భవం జరుగుతుంది. ఇది మనకు ఎంతో పవిత్రమైంది. అదే శివరాత్రి నాడు 2014లో సాయి దత్త పీఠం ఉద్భవించింది.న్యూజెర్సీ – సౌత్ ప్లైన్‌ఫీల్డ్ లో ఏర్పాటైన ఈ సాయి దత్తపీఠం అమెరికాలో సాయి భక్తులకు ఓ వేదికలా మారింది. సాయి నాథుడు, దత్తాత్రేయుడి ప్రాణ ప్రతిష్ట చేసుకుని సాయి చూపిన మార్గంలో సాయి దత్తపీఠం నడిచింది.

సాయి దత్త పీఠం 2014లో ప్రపంచ శాంతి కోసం లలిత మహా యజ్ఞం నిర్వహించింది. అశేషంగా భక్తులు ఈ యజ్ఞంలో పాలు పంచుకున్నారు.. వసుదైక కుటుంబంగా అకాంక్షిస్తూ లలితా దేవిని ఆరాధించారు. 2014 నుండి ప్రతీ సంవత్సరం.. అయ్యప్ప పడి పూజ, జ్యోతి యాత్ర, మే 2015లో నిర్వహించిన విష్ణు సహస్ర నామ యజ్ఞానికి విశేష స్పందన లభించింది. 2016లో 50 నుండి 60 మంది ఋత్వికులతో అఖండ రుద్ర పారాయణం, 2018లో లక్ష లలితా సహస్ర నామ పారాయణం, ఇంటింటా సప్త సప్తాహ శ్రీ సాయి సత్ చరిత్ర పారాయణం, శ్రీ సాయి కోటి, శ్రీ రామకోటి లిఖిత జపం, సాయి దీక్ష మండల జపం, 24 గంటల అఖండ సాయి నామ సంకీర్తనం... ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో...

సాయి మార్గమంటే కేవలం యజ్ఞ యాగాదులు మాత్రమే కాదు.. సేవ.. సాయం, సత్సంగం, అన్న దానం ఈ నాలుగింటిని సాయి దత్త పీఠం సదా ఆచరిస్తూ వస్తోంది. సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడంలోనే దైవత్వం ఉందనేది చాటుతూ అనేక కార్య క్రమాలు చేపట్టింది. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసింది. బడి మానేసిన పిల్లలను మళ్లీ బడికి పంపేందుకు కావాల్సిన సహకారాన్ని అందించింది. హోమ్ లెస్ షెల్టర్ల లోని అన్నార్తులకు, నిస్సహాయులకు ప్రతీ ఆదివారం ఆహార సదుపాయం, ప్రతి ప్రత్యేక దినోత్సవాల సమయంలో ఫుడ్ డ్రైవ్, టోయ్ డ్రైవ్, క్లోత్ డ్రైవ్ లాంటి కార్యక్రమాలు చేపట్టి వాటి ద్వారా సేకరించిన వాటిని పేదలకు అందించింది.

నేపాల్ భూకంప బాధితులకు సాయం చేసింది. విశాఖ హుద్ హుద్ తుఫాను బాధితులకు రేకుల షెడ్‌ల నిమిత్తం, కొందరు రైతులకు గోవులను, ముఖ్య మంత్రి సహాయ నిధికి ఆర్థిక సహాయం, టెక్సాస్‌లో హార్వే బాధితులకు అమెరికన్ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా తన వంతు చేయూతను ఇచ్చింది. విద్యతోనే వికాసం.. అని భావించే సాయి దత్త పీఠం పేద విద్యార్థులకు ఇండియా లోనూ, అమెరికా లోనూ ఉపకార వేతనాలు ఇస్తూ పరోపకారం పై చెప్పిన సాయి సందేశాన్ని ఆచరించి చూపింది.

శ్రీశ్రీశ్రీ చిన జియ్యర్ స్వామిజీ, శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద, శ్రీశ్రీశ్రీవిశ్వయోగి విశ్వంజీ, శ్రీ కరుణామయి మాత, శ్రీ సిద్దేశ్వరానంద స్వామి (కుర్తాళమ్ స్వామిజీ)... ఎందరో ఆధ్యాత్మిక వేత్తలు (ప్రవక్తలు) దైవ సమానులు శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు, శ్రీ గరికపాటి నరసింహారావు గారు తదితర ప్రవక్తలు ఈ సాయి దత్త పీఠానికి విచ్చేసి తమ విలువైన సందేశాలను భక్తులకు అందించారు.

"అతిథి దేవోభవ" అంటూ ఆలయానికి వచ్చి వెళ్ళే ఏ భక్తుడి నైనా సాదరంగా ఆహ్వానించి, ఆకలితో వెళ్లకుండా అందరికీ అన్నప్రసాదం అందిస్తుంది సాయి దత్త పీఠం.

ఇక ప్రతిరోజు అర్చనలు, పూజలతో పాటు వాహన పూజ, నామకరణ, అన్నప్రాసన, శ్రీ సత్య నారాయణ వ్రతం, బాబా వ్రతం, శ్రీ లక్ష్మీ పూజ, శ్రీ గణేశ

పూజ, సర్వ దేవత అర్చన, వివాహాలు, ఉపనయనం లాంటి ఎన్నో శుభకార్యాలు సాయి దత్త పీఠం వేదికగా జరుగుతున్నాయి. ప్రతీ గురువారం భక్తుల జన్మదిన, వివాహాది శుభ కార్యాల సందర్భంగా వేద ఆశీర్వచ నాలతో బాబా వారి శేష వస్త్రాన్ని బహుకరించడం ఓ సంప్రదాయంలా కొనసాగిస్తోంది సాయి దత్తపీఠం..

ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణలు, మేరీల్యాండ్‌లో అయ్యప్ప దేవాలయా నికి, ఇండియాలో శబరిమలకు యాత్రలు నిర్వ హిస్తోంది.



భారతీయ ఆధ్యాత్మిక జ్యోతి అమెరికాలో ప్రజ్వ రిల్లేలా చేసేందుకు.. అకుంఠిత కార్యదీక్షతో ధర్మశ్రీ రఘుశర్మ శంకరమంచి ఏర్పాటుచేసిన వేదిక సాయి దత్త పీఠం.. ఈ పీఠం నేడు "అమెరికా లో షిరిడీ" నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అమెరికా సాయి భక్తుల కల సాకారం చేయనుంది.

సాయి తత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేం దుకు ఇప్పుడు సాయి దత్త పీఠం "అమెరికా లో షిరిడీ" నిర్మాణమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.

ఆ షిరిడీ నాథుడి పాదాలనే భక్తుల చెంతకు తీసుకెళ్లి.. 'అమెరికాలో షిరిడీ' లక్ష్యాన్ని వివరించింది. సాయి దత్త పీఠం ప్రధాన నిర్వాహకులు ధర్మశ్రీ రఘుశర్మ శంకరమంచి నేతృత్వంలో, ముగ్గురు దత్త పీఠం పురోహితుల సహకారంతో పాదుకా రథంలో రెండు సంవత్సరాల పాటు అమెరికాలో 43 రాష్ట్రాల్లో 75000 మైళ్ల దూరం ఈ సాయి పాదుకయాత్ర సాగింది. సాయి దత్త పీఠం భక్తుడు ఒకరు విరాళంగా అందచేసిన వెండి పల్లకీలో సాయి రథం ద్వారా షిరిడీలో అర్చన చేసి తీసుకు వచ్చిన బాబా పాదుకలతో శ్రీ రఘు శర్మ స్వయంగా రథసారథ్యంలో సాయి పాదుకా యాత్ర 43 రాష్ట్రాల్లో దాదాపు 2,500ల భక్తుల గృహాలకు చేరుకుని సాయి పాదుక పూజ చేసింది. 150 కి పైగా దేవాలయాలను చుట్టివచ్చింది.

స్థల సేవ లక్ష్యం పూర్తి కాగానే ఇప్పుడు సాయి దత్త పీఠం నిర్మాణ సేవ అంటూ సాయి భక్తుల చెంతకు వెళుతోంది. అమెరికాలో షిరిడీ నిర్మాణం పూర్తి చేయడానికి ఈ నిర్మాణ సేవ ద్వారా విరాళాల సేకరణ చేపడుతోంది. అమెరికాలో షిరిడీ నిర్మాణం అనే మహా యజ్ఞానికి సాయి భక్తుల నుంచి విశేష మద్దతు లభి స్తోంది. స్వామీజీలు, ఆధ్యాత్మిక వేత్తలు అమెరికాలో షిరిడీ నిర్మాణానికి తమవంతు సాయం అందిస్తున్నారు.. సాయి దత్త పీఠం చేపట్టే ప్రతి కార్యక్రమానికి వారూ సంపూర్ణ మద్దతు అందిస్తున్నారు.. సాయిదత్త పీఠం.. 'ఇంతితై వటుడింతై' అన్న చందంగా ఎదుగుతున్న ఈ క్రమంలో సాయి భక్తులు, సాయి సేవకులు చేస్తున్న కృషి మరువలేనిది. నిర్మాణ సేవకు కూడా ఇప్పుడే వారే సారథులు..." అమెరికాలో షిరిడీ" నిర్మాణమనేది అమెరికాలోని ప్రతి సాయి భక్తుడి కల.. ఆ కలను నిజం చేసే దిశగా సాయి దత్త పీఠం అడుగులు వేస్తోంది. అందరి ఆశీర్వాదాల ఫలితంగా ఆ కల త్వరలోనే నిజం కాబోతోంది.

గత సంవత్సరం విజయదశమి నాడు మరియు బాబా వారి 100 సం॥ల పుణ్య తిథి సందర్భంగా ఫ్రాంక్లిన్ టౌన్ షిప్ వారి పరిమిత పర్మిషన్స్ నడుమ, విజయదశమి నాడు భూమి పూజ నిర్వహించారు.

సాయిదత్తపీఠం నిర్వాహకులు రఘుశర్మ శంకర మంచి, వేద పండితుడు భైరవ మూర్తిల ఆధ్వర్యంలో అమెరికాలో షిరిడీ" నిర్మాణానికి భూమి పూజ జరి గింది.

స్థల దాతలు, నిర్మాణ దాతల వివరాలను ఆలయ గోడల మీద లిఖియించటం జరుగుతుంది. దాతలతో పాటు ప్రత్యేక విరాళాలిచ్చే దాతల కుటుంబసభ్యుల పేర్లను ఈ గోడలపై చెక్కిస్తారు. గురుస్థానం, లెండి వనము, ద్వారకామాయి, నిత్య ధుని, చావడి సదు పాయాన్ని ఈ ఆలయంలో కూడా నిర్మించనున్నారు.

బాబా అనుగ్రహంతో భక్తుల నుండే ఎంపిక కాబడిన 11 మంది సభ్యులతో ఎగ్జిక్యూటివ్ బోర్డు డైరెక్టర్ల గానూ, మరో 11 మంది తో 2 సంవత్సరాల కాలపరిమితి తో కూడిన డైరెక్టర్ల గానూ ఉన్న కార్యవర్గం అనునిత్యం బాబా సేవ లో తరిస్తూ వ్యవస్థాపక చైర్మన్ శ్రీ రఘు శర్మ శంకరమంచి, వైస్ చైర్మన్ రోజా రాణి శంకరమంచిల సూచనలతో సాయి దత్త పీఠంను ముందుకు నడిపిస్తోంది.

శ్రీ ఉపేంద్ర చివుకుల గారి సహకారం తో టౌన్ షిప్ వారి నుండి తుది ఆమోద ముద్ర కొరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఆమోదం లభించగానే తొలి దశ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుంది.

ఈ సందర్భంగా, కళాకారులు మరియు సాయి భక్తులైన 65 మంది చే శ్రీ హేమద్పంత్ రచించిన బాబా సత్చరిత కు మరిన్ని బాబా లీలలను జోడించి, న్యూ యార్క్ లోని సాయి సమర్పణ్ అనే స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో, Ek Me Anek (One In Many) "భిన్నత్వంలో ఏకత్వం" అనే బ్రాడ్ వే ప్లే ద్వారా సాయి దత్త పీఠం నిధుల సమీకరణ ను నిర్వహిస్తోంది. దాదాపు 2 గంటల 45 నిమిషాల పాటు భావోద్వేగ భరితంగా సాగే ఈ నాటిక పూర్తిగా ఆంగ్లంలో, అక్కడక్కడా మరాఠీలో సాగుతుంది. బాబా వారి జీవితం యొక్క అద్భుతమైన వర్ణన, వారు చెప్పిన శ్రద్ధ మరియు సబూరి యొక్క సందేశము, అన్ని మతాలూ ఒక్కటే అని చెప్పే సాయి తత్త్వం చూసి తీరవలసిన కార్యక్రమం. సాయి మార్గాన్ని భావితరానికి చూపే ఈ అద్భుత సంగీత నృత్య రూపకంలో తమ వంతుగా సహాయం అందించి, మే 4 న, 950 పార్క్ అవెన్యూ, ప్లైన్‌ఫీల్డ్ హై స్కూల్, ప్లైన్‌ఫీల్డ్, న్యూ జెర్సీ 07060లో పాల్గొనగలరు. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# గంజాయి వనంలో తులసీ మొక్కలు

ట్రాఫిక్ సిగ్నల్ పడింది. నేను జీబ్రా క్రాస్సింగ్ మీద వడి వడిగా నడుస్తున్నాను. ఇంతలో ఒక మోటర్ బైక్ చోదకుడు శర వేగంగా దూసుకుని వెళ్ళాడు. అతన్ని చూసి మరో వాహనదారుడు ముందుకి వెళ్ళబోయాడు. జీబ్రా క్రాస్సింగ్ మీద నడుస్తున్న పాదచారులు ఆ రెండో వాహనదారుడు కూడా సిగ్నల్ దాటి వెడతాడేమో అని తాము వీధిని దాటాలా వద్దా అని తటపటాయిస్తున్నారు. ఇది గమనించిన నేను "ఇడియట్. సిగ్నల్ పడింది. గుడ్డివాడివా? బుద్ధిలేదా?" అని అరిచాను. నా అరుపుకి బెదిరి ఆ రెండో వాహనదారుడు జేబ్రా క్రాస్సింగ్ మధ్యలోకి వచ్చిన వాడు కాస్తా ఇంక తప్పదన్నట్టు ఆగాడు. బండిని మధ్య లో ఆపినందుకు సిగ్నల్ దగ్గర వీధి దాటుతున్న పాదచారులు అతన్ని తిట్టుకుంటూ నడవ సాగారు. నేను వీధి దాటుతుండగా ట్రాఫిక్ పోలీసు నాకేసి చూసి, "ఆ లం... కొడుకుని ఈడ్చి లాగి నాలుగు తన్నండి సార్. బుద్ధి లేని వెధవలు. జనాలు తంతే అన్నా వీళ్ళకి బుద్ధి వస్తుంది ఏమో" అన్నాడు. నాకు అప్పుడు అనిపించింది పాపం ట్రాఫిక్ పోలీసు రోజుకి ఎంతమంది ఇటువంటి వెధవలని అదుపులో పెట్టాల్సి వుంటుందో అని. నాకు నా బాల్యం గుర్తుకి వచ్చింది. నేను ఒంటరిగా రోడ్ క్రాస్స్ చేయడం మొదలు పెట్టినప్పుడు మొదట్లో కొన్ని రోజులు మా అమ్మా నాన్నా పదేపదే నాకు చెప్పేవారు "నాన్నా . రోడ్ జాగ్రత్తగా క్రాస్స్ చెయ్యి. సిగ్నల్స్ దగ్గరే, సిగ్నల్ పడినప్పుడే రోడ్ క్రాస్స్ చెయ్యి. ఎక్కడ పెడితే అక్కడ రోడ్ క్రాస్స్ చెయ్యకు. ప్రమాదం సుమా". నాకు తెలిసి నా బాల్యం లో ప్రజలు చాలా మటుకు ట్రాఫిక్ రూల్స్ పాటించేవారు. ఎవరన్నా అడ్డదిడ్డంగా రోడ్ దాటినా , సిగ్నల్ పడినప్పుడు వాహన దారులు తమ వాహనాలని ఆపకుండా నడిపినా చుట్టూ వున్న జనం మందలించే వారు. ట్రాఫిక్ పోలీసు అంటే కాస్త భయపడేవారు కూడా. మరి అప్పటికీ ఇప్పటికీ ఈ మార్పుకి కారణం ఏమిటా అని ప్రశ్నిస్తే మనకి సమాధానం రెండు విషయాలు గోచరిస్తాయి ... ఒకటి అప్పట్లో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించటానికి జంకేవారు. ఇప్పుడు జనాలు ట్రాఫిక్ రూల్స్ ని ఖాతరు చేయటం లేదు. చెలాన్ వచ్చినప్పుడు ఫైన్ కట్టచ్చులే అని తమకి తామే సర్ది చెప్పుకొని వాహనదారులు తమ ఇష్టానుసారంగా వాహనాలని నడపటం, పాదచారులు తమ ఇష్టానుసారంగా రోడ్ క్రాస్స్ చేయటం జరుగుతోంది. రెండు ప్రతీ వాడు తన హడావుడిలో నిమగ్నమై వుండటం వల్ల ఎదటివాడు సవ్యంగా వున్నడా లేదా అని పట్టించుకోవటం బొత్తిగా మానేశారు. దీనితో అడిగేవాడు లేకపోవడంతో ట్రాఫిక్ రూల్స్ ని ఉల్లంఘించే వారి సంఖ్య పెరిగింది.

నేరాలు చేసేవారి సంఖ్య రానురాను పెరుగుతోంది అనటంలో సందేహం లేదు. దానికి కారణం ఏమిటని విశ్లేషిస్తే మనకి కొన్ని అంశాలు కనిపిస్తాయి. ఒకటి మనుష్యలలో నీతీ,నిజాయితీ లోపించటం. రెండు శాంతి భద్రతల అమలులో, న్యాయ వ్యవస్థలో లోపాలు. నీతీ, నిజాయితీ, నైతిక విలువల బీజాలు మనిషికి బాల్యంలోనే పడతాయి. బాల్యంలో తల్లిదండ్రుల పెంపకం, ఇతర పెద్దలు ( తాతయ్యలు, అమ్మమ్మ, నాన్నమ్మలు), స్కూల్ లో ఉపాధ్యాయుల ప్రభావం, కొంతవరకు బాల్య స్నేహితుల ప్రభావం ఈ బీజానికి అంకురార్పణ చేస్తాయి. ఇటీవలి కాలంలో జాయింట్ ఫామిలీలు చిన్నాభిన్నం అవటం, తల్లితండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులవటం వల్ల పిల్లలు బాల్యంలోనే ఒంటరివారైపోవటంతో నియంత్రణ లేని టీవీ, ఇంటర్నెట్, సినిమాల దుష్ప్రభావం ప్రబలంగా ఉండటంతో పిల్లలు నైతికంగా బలహీనుల వుతున్నారు. బాల్య నేరస్తుల సంఖ్య రానురాను పెరగటానికి ఇది కూడా ఒక ముఖ్య కారణం.

సూక్ష్మంగా మనుషులని నాలుగు రకాలుగా విభజించవచ్చు. ఒకటి– పూర్తి స్థాయి నైతిక విలువలు కలిగివున్నవారు. వీరు ఎట్టి పరిస్థితి లోనూ తమ నైతిక విలువలలో రాజీ పడరు. రెండు– నైతిక విలువలని కలిగివున్నప్పటికీ కొన్ని తప్పనిసరి పరిస్థితులలో తమ విలువలతో రాజీ పడేవారు. మూడు– పైకి మంచి నైతిక విలువలని కలిగివున్నట్టు నటిస్తూ ఎప్పుడెప్పుడు అనైతికంగా ప్రవర్తించడానికి అవకాశం వస్తుందా అని ఎదురు చూసేవారు. నాలుగు– పూర్తిగా నైతిక విలువలని గాలికి వదిలేసినవారు. మొదటి రకానికి చెందినవారు చట్టాలు వున్నా, లేకపోయినా, ఇతరులు తమని చూస్తున్నా, చూడకపోయినా నైతిక విలువలని తు చ తప్పకుండా పాటిస్తూనే వుంటారు. రెండో రకానికి చెందినవారు కేవలం ప్రతికూల పరిస్థితులలో మాత్రం తమ నైతిక విలువలతో తప్పనిసరియై రాజీ పడతారు. మూడో రకానికి చెందినవారు చాలా ప్రమాదకరమైన వారు. పైకి నిజాయితీగా నటిస్తూ ఎల్లప్పుడూ అవకాశం కోసం ఎదురు చూసేవారు. సమాజ వ్యవస్థ పటిష్టంగా ఉన్నంతవరకు వీరితో ప్రమాదం లేదు. శాంతి భద్రతల అమలులో, న్యాయ వ్యవస్థలో లోపం, లొసుగు లేనంతవరకు వీరితో ప్రమాదం లేదు. కానీ ఏమాత్రం అవకాశం దొరికినా వీరు వదిలి పెట్టరు. నాలుగో రకానికి చెందిన వారికి, చట్టాలు, న్యాయవ్యవస్థలు వున్నా, లేకున్నా ఒక్కటే. వీరు దేనినీ లెక్క చేయరు. ఈ కోవకి చెందిన వారిని నియంత్రించాలంటే దేశంలో చట్టాలు, న్యాయవ్యవస్థలు కఠినంగాఉండటం మాత్రమే కాక, శిక్షలు సత్వరమే అమలు చెయ్యాలి. మన దేశంలో న్యాయస్థానాలలో ( జిల్లా కోర్టులు నుంచి సుప్రీం కోర్ట్ వరకు) దాదాపు మూడు కోట్ల వాజ్యాలు ఏళ్ల తరబడి నానుతున్నాయి. అదే విధంగా పోలీసు స్టేషన్ లలో నమోదు అయి కూడా ఒక కొలిక్కి రాని కేసులు చాలానే వున్నాయి. జాప్యం లేకుండా బాధ్యతాయుతంగా ఈ వాజ్యాలు, కేసులు త్వరితగతిని పరిష్కారం అయినప్పుడే న్యాయ వ్యవస్థ మీద ప్రజలకి విలువ, నేరస్తులకి భయం ఏర్పడుతుంది.

పైన వివరించిన నాలుగు రకాల మనుషుల గురించి టూకీగా ఉదాహరణ లతో చెప్పాలంటే ఎల్ల వేళలా ట్రాఫిక్ నిబంధనలను పాటించేవారు మొదటిరకం మనుషులు. ప్రాణాపాయ స్థితిలో వున్న ఆప్తులని హాస్పిటల్ కి తీసుకుని వెళ్ళాల్సిన పరిస్థితిలో తప్పనిసరియై ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంహించే వారు రెండో రకం మనుషులు. ట్రాఫిక్ పోలీస్ వున్నప్పుడు నిబంధనలని పాటించి, అతను లేనప్పుడు లేదా అతను ఏమరపాటుగా వున్నప్పుడు నిబంధనలని ఉల్లంహించేవారు మూడో రకం మనుషులు. నిబంధనలను బొత్తిగా ఖాతరు చేయక ఎల్లప్పుడు వాటిని ఉల్లం ఘించేవారు నాలుగు రకం మనుషులు. ఒకప్పుడు ఈ మూడో రకం, నాలుగోరకం మనుషులు కొద్దిమందే వుండేవారు. ఇప్పుడు మొదటి రకం, రెండో రకం మనుషులు చాలా కొద్దిమందే వున్నారు. తులసివనంలో గంజాయి మొక్కలనుంచి మనం గంజాయి వనంలో తులసి మొక్కల స్థాయికి దిగజారాం.


**– బి.యన్.వి. పార్ధసారధి**







## పరమార్ధ కథలు
# శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు



### 3. అలసత్వమును పారద్రోలవలెను

పూర్వమొకానొక పట్టణమునకు సమీపముగ నొక కుగ్రామ ముండెను. అందనేక రైతుజనులు కాపురముండు చుండిరి. ఒకనాటి రేయి గ్రామస్తులందఱును నిదురించుచుండ అర్ధరాత్రి సమయమున ఊరిలోని గుడిసెలకు నిప్పంటుకొని భగభగ మండిపోవుచుండెను. గ్రామస్తు లందఱున్ను నిద్రలేచి వారివారి సామాను లన్నియు బయటకు లాగి ఆ పిదప ఏమి చేయవలెనో తోచక అందఱు ఒక రచ్చబండపై జేరి కర్తవ్యమును ఆలోచింపదొడగిరి. గ్రామశాసన సభయొక్క అత్యవసర సమావేశమది. అందొకడు లేచి "మహాజనులారా! ఇది తామసించుటకు సమయము కాదు. వెంటనే ఇంటికి ఒక్కొక్కరు చొప్పున వెళ్ళి తాటాకులు పెఱికివేసి నిప్పును ఆర్పవలెను" అను అభిప్రాయ మొసగెను. మరియొకడు తక్షణమే లేచి "గౌరవసభ్యుని అభిప్రాయముతో నేనేకీభవించను. ఏలననగా ఆ కార్యమువలన నిప్పు పూర్తిగా శమించదు. కావున సమీపముననే పట్టణము కలదు. ఎవరైనను అచటికి పరుగెత్తివెళ్ళి నిప్పు చల్లార్చు యంత్రము (Fire Engine) ను తీసికొని వచ్చినచో ఒక్క నిముష ములో అది నిప్పంతటిని చల్లార్చి వేయగలదు" అని చెప్పి కూర్చుండెను.

ఈ ప్రకారముగ ఒక్కొక్కరు వారివారికి తోచిన విధముగ అమూల్య భావము లను, సలహాలను చెప్పుచుండగ అత్తఱి సభామధ్యమునుండి ఒక పెద్దమనిషి లేచి "అయ్యా! ఈ మాటలన్నియు కట్టిపెట్టండి. మీరిచ్చిన సలహాలలో ఒకటియు సందర్భో చితముగ లేదు. నేనెంతయో ఆలోచించి చక్కని ఉపాయమును చెప్పుచున్నాను. దానిని విని ఆచరణలో పెట్టితిరా గ్రామమును అగ్నికి ఆహుతి కాకుండ తప్పించ గలరు. లేకున్న మొత్తము పరశురామప్రీతి కాకుండ మానదు. నేను చెప్పబోవు ఉపాయమేమనగా, గ్రామస్తులందఱును వారివారి పలుగులు, పారలు తెచ్చి సమీ పముననే ఒక బావిని తవ్వినచో కావలసినన్ని నీళ్ళు దొరుకును. ఆ నీటిచే ఎంతటి అగ్నినైనను సులభముగ ఆర్పివేయువచ్చును. కావున కర్తవ్యమునకు గడంగుడు" అని ఆనతిచ్చెను.

అదివిని అందరును ఫక్కున నవ్విరి. అట్లే నవద్వారములతో ఈ దేహమను పంజరమున ప్రాణమను పక్షి ఏ క్షణములోనైనను ఎగిరి పోవుటకు సిద్ధముగ నున్న ఈసమయమున వ్యాధులు, విఘ్నములు, వియోగములు, అశాంతికర పరిస్థితులు తండోప తండములుగ వచ్చి మీదపడుచుండ, మీన మేషములు లెక్కపెట్టుచు, కడతేరు మార్గమును గూర్చి ఆలోచింపక దైవధ్యానమునకు ఇంకను చాలా సమయమున్నదిలే" అని తామసించు జనులయొక్క యోచన బావిత్రవ్వు ఘనుని యొక్క యోచనవలెనే యుండును.

కనుకనే భర్తృహరి

**సేదీప్తే భవనే తు కూపఖననప్రత్యుద్యమః కీదృశః?**

అని గంభీరముగ ప్రశ్నించి, అట్టి దీర్ఘసూత్రులను పరిహసించెను. పైనదెల్పిన కూప సాదృశ్యమునే యాతడు తన యా వాక్యముల ద్వారా వ్యక్తము చేసెను. కావున విజ్ఞుడగువాడు బాగుగా యోచించి అమూల్యమగు ఈ మానవ జీవితమును భోగములందుగాక యోగమునందే వినియోగించుచు ఆత్మజ్ఞానమును శీఘ్రముగా సంపాదించి జన్మసాఫల్యమును బొందవలెను. భగవంతుని పాదపద్మములను ఆశ్రయించి భవరోగమును బాపుకొనవలెను.

**నీతి:- ఆలసింపక సర్వేశ్వరుని శీఘ్రముగ శరణు బొందవలెను.**

### 4. ఆత్మ సాక్షాత్కారమెట్లు కలుగును?

పూర్వకాలమున ఒకానొక ధార్మిక చిత్తుడగు రాజుండెను. విశాలమగు తన రాజప్రాసాదముయొక్క మహోన్నత కుడ్యముపై మహాభారత యుద్ధసమయమున శ్రీకృష్ణపరమాత్మ రథముపై గూర్చుండి అర్జునునకు గీతోపదేశము చేయుచుండిన పవిత్ర దృశ్యమును చిత్రింపించవలెనని యతనికి అభిలాష జనించెను. అక్కార్యము నకై యాతడు తన దేశమందలి ధురంధరులగు చిత్రకారులందఱిని రప్పించి వారినందఱిని పరీక్షించి అందులో మహాప్రజ్ఞావంతులగు నిరువురిని మాత్రము ఏరుకొనెను. ఆ యిరువురిని తన రాజభవనము యొక్క రెండవ అంతస్తు పైకి తీసికొని వెళ్ళి "ఓ చిత్రకారులారా! గీతపై నాకు మక్కువ జనించినది. గీతాచిత్రమును నిరంత రం నా కళ్ళెదుట చూచుకొని ఆనందించవలె నను కుతూహలము కలిగినది. గీతోపదేశము చేయుచుండ పార్ధసారథియొక్క పావన ముఖారవిందమును సదా సర్వకాలములం దును సందర్శించి కృతార్థుడను కాదలంచితిని. కావున మీరిరువురును చెరియొక గోడతీసికొని వానిపై గీతోపదేశ చిత్తరువులను లిఖింపుడు. సమయము 6 మాస ములు. ఉత్తమ చిత్రమునకు బహుమానము 10 వేల రూప్యములు. మీ భోజనము వగైరాలను మేమే భరించెదము. మీరు మాత్రము ఏకాగ్రచిత్తముతో జీవకళ ఉట్టిపడుచుండు విధముగ వానిని చిత్రింపుడు" అని వారితో పలికెను. వారట్లే యంగీకరించిరి.

వారికివ్వబడిన గోడలు ఎదురెదురుగ నుండెను. మఱుసటిరోజు నిర్ణీత సమయమున పోటీ ప్రారంభమయ్యెను. ఇరువురును వారివారి నైపుణ్యమును జూపుటకు కృతనిశ్చయులైరి. ఒకరి చిత్తఱువును మరియొకరు 'కాపీ' కొట్టకుండ గోడలపై పెద్ద తెరలు దించబడెను. ఆ తెరల వెనుక వారు తమ కార్యమును దీక్షతో నుపక్రమించిరి. 7 నెలలు గడచెను. బహుమానమును నిర్ణయించుటకై ప్రముఖులగు నిర్ణేతలు (Judges) రప్పింపబడిరి. మొదటి గోడకు తగిలించిన తెర యెత్తబడెను. చిత్తరువు కండ్లకు కొట్టినట్టు అగుపడెను. సాక్షాత్ శ్రీకృష్ణమూర్తియే ఆ హర్మ్యమున వెలసెనా అనుపించు నంతటి సహజగాంభీర్య లావణ్యములతో తొణికిసలాడుచుండెను. ఆ చిత్రరాజము చిత్రకారుడు తన పంచ ప్రాణములను దానియందు ధారబోసెనా యనిపించుచుండెను. అది గాంచి నిర్ణేతలలో చాలమంది 'ఇదియే రెండింటిలో ఉత్తమ చిత్రము కావచ్చును' అని మనంబున ఊహాగానము చేసికొనిరి. అయినను తుది నిర్ణయము చేయుటకు రెండవది కూడ చూడవలెను గదా అనియెంచి దానికి ఎదురుగానే ఉన్న రెండవ గోడను సమీపించిరి.

ఆ రెండవవాని పరిస్థితి యెట్లున్నదనిన, ఆరునెలలు లక్షణముగా మూడు పూటలు రాజభోజనమును ఆరగించుచు చిత్తరువును ఒకింతైనను లిఖింపక ఊరకనేయుండెను. అయితే ఒక గాజుపెంకును తీసికొని గోడయావత్తును దానితో బాగుగా రుద్దుచుండెను. ఈ ఆరునెలలు అదేపనిగా రుద్దగా రుద్దగా చివఱకు ఆ గోడ నున్నగా అద్దమువలె తయారయ్యెను. ఏ సమయమున ఆ గోడకు తగిలించ బడిన గోడ యెత్తివేయబడెనో, ఆ సమయముననే అద్దము వలెనున్న ఆ గోడలో ఎదుటవాని చిత్తరువు ప్రతిబింబించెను. నిర్ణేతలందరును ఆశ్చర్యచకితులైరి. 'ఆహా! ఎట్టి చిత్రమునీతడు లిఖించెను, మొదటివాడు రంగులతో వ్రాసెను. ఈతడు రంగులు లేకనే రంగులను సృష్టించెనే! మొదటివాడు గోడపై గీసెను. ఈతడు గోడలోపల గీసెనే! పైగా చిత్రము అద్దమునందు వలె తళ తళ మెరయుచున్నదే! ఓహో! అద్భు తము! ఎట్టి చాకచక్యము!' అని దానిని మిక్కుటముగ పొగడుచు దానిని లిఖించిన వానికే ప్రథమ బహుమానమును సమర్పించి వైచిరి. చూచితిరా! చిత్రమేమియు లిఖింపకున్నను పారితోషికము బడయగల ఘనత నాతడెట్లు సంపాదించగల్గెనో! ఉన్న వస్తువును శుద్ధమొనర్చుటయే అతడు చేసినపన్ని క్రొత్తవస్తువును తెచ్చి చేర్చుటకాదు.

అట్లే ఆత్మసాక్షాత్కారమును బడయగోరు ముముక్షువు క్రొత్తగా ఒక వస్తువును అది దేవుడైనను సరే తనలో నూతనముగ తీసికొని రావలసిన పనిలేదు. ఆ దేవుడు తనలో సిద్ధముగా నున్నాడు. క్షేత్రజ్ఞ రూపమున వెలయుచున్నాడు. (అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయ స్థితః), కాని జీవుని మలిన మనస్సుచేత కప్పబడి అనుభూతుడు కాకయున్నాడు. అనేక జన్మార్జిత ఘనీభూత వాసనా జాలముచే తిరోహితుడై వర్తించుచున్నాడు. ఎపుడా మనస్సు అభ్యాసవశమున శుద్ధపడునో, నిర్మలదర్పణమున ప్రతిబింబమువలె అట్టి నిర్మలాంతఃకరణమున ఆత్మతేజము లెస్సగా భావించును. అదియే ఆత్మసాక్షాత్కారము.

**నీతి:- మనో నిర్మలత్వమే ఆత్మసాక్షాత్కారమునకు ఏకైకమార్గము.**



# ధర్మసూక్ష్మము లెరింగిన పరంధాముడు, ఆనందధాముడు, ఆదర్శపురుషుడూ, అయోధ్యా రఘురాముడే!

రామాయణం ఏదో కట్టుకథయని భావించేవారిని మూర్ఖులనే అంటారు. రఘు రాముడు మూర్తీభవించిన ధర్మమూర్తి, పితృవాక్య పరిపాలకుడు, ధర్మాన్ని తూ.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ ధర్మమూర్తి. ఆత్మ నిత్యమూ, ఆకాశం నిత్యమూ, కాలం నిత్యమూ, ఋతువులు నిత్యమూ, దిక్కులు నిత్యమూ, ప్రకృతి నిత్యమూ, సూర్యచంద్రులు నిత్యమూ అని భావించినప్పుడు రాముడూ, రాముని కథా, రామాయణమూ నిత్యమూ అనే భావించాలి.

నదులూ, పర్వతాలూ, వృక్షాలూ, పశుపక్షి కీటకాదులు వంటి ప్రాణాలు నిలిచి ఉన్నంతకాలమూ, రాముడూ, రాముని చరితమూ, రామాయణమూ నిలిచి ఉంటుంది. అగ్నికి వేడిమి, చంద్రునికి చల్లదనం, పద్మానికి శోభ, సూర్యునికి ప్రకాశం ఎలా అవిభాజ్యాలో రామునికి దానగుణం అలాటి అవిభాజ్యమైనదే. రామాయణంలోని పాత్రలూ, పాత్రల స్వభావం అంత విశిష్ట లక్షణం కలవి.

రామాయణంలో ప్రథమంగా వచ్చేది అయోధ్యా పట్టణం. అయోధ్య అంటే గెలవ శక్యం కానిది అని వ్యుత్పత్తి అర్థంగా చెప్పుకోవచ్చును. శరీరానికి ప్రతీకగా అయోధ్యను చెప్పుకున్నప్పుడు, దశరథుణ్ణి దశేంద్రియాలు కల శరీరునిగా చెప్పుకోవడంలో అసబబు లేదు. అయిదు కర్మేంద్రియాలూ, ఐదు జ్ఞానేంద్రియాలు కలిసి, మొత్తం పది ఇంద్రియాలు శరీరంలో ఉన్నాయ్. ఈ దశేంద్రియాలనూ గాడి తప్పకుండా నడిపించే నాయకుడు. ఆయనే అయోధ్యా మహారాజు దశరథుడు.

ఇహ మరో 'దశ' శబ్ద వాచ్యుడైనవాడు రావణుడున్నాడు. ఆయనకు పది తలలున్నాయ్. అంటే పది కంఠాలు ఉండి తీరాలి. ఒక కంఠం కలవాని ఉద్రేకం, తామసగుణాన్నే భరించలేకపోతున్నాం. రాక్షసగుణ స్వభావానికే పది కంఠాలూ, ఇరవై దృశ్యేంద్రియాలూ, ఇరవై శ్రవణేంద్రియాలూ, అసురబుద్ధులూ కలవారై ఉంటారు. అలాటివారు తమ తామసగుణానికి తోడుగా సర్వవ్యాపుడూ, సంహారకర్తా, ఆగ్రహోదగ్రుడూ, భోళా స్వభావుడైన శివుణ్ణి ప్రార్థిస్తూంటారు. కుటిలాలోచనల్తో సృష్టికర్తను ఆశ్రయిస్తూంటారు. అలాటివాడే రావణబ్రహ్మ.

గుణశీలుడైన రామచంద్రుడు 'రమంతే యోగినేః అస్మిన్ ఇతిరామః' అన్నారు రాముణ్ణి. యోగపురుషులు ఆనందించేది జ్ఞానం. సత్య వాక్పరిపాలకుడైనవాడు శ్రీరామచంద్రుడు. నాలుగు పాదాలా ఆచరించే ధర్మగుణం ఆయనలో ఉంది. ఎంతటి ధర్మమూర్తో అంతటి వీరాగ్రేసరుడు. అందుకే ఆయన బాణానికి తిరుగులేదు. ఆయన మాటకు తిరుగులేదు. ఆయన స్నేహహస్తానికీ తిరుగులేదు.

కౌసల్య – ఆయన్నుకన్న మాతృమూర్తి కౌసల్య కుశల స్వభావురాలు. పట్టపురాణి అయ్యిండీ, స్వాతిశయం లేకుండా సాత్వికంగానే జీవితం నెరపింది. అందుకే భగవంతుడు మెచ్చి ఆమె గర్భాన్నే ఉదయించాడు. దానితో ఆమెలోని సాత్విక భావం, సహనం మరింతగా పెరిగింది. భర్త ఎడబాటునూ, ఏకైక కుమారుని ఎడబాటునూ ఓర్మితో భరించింది.

కైక – 'క' 'ఏక' కైక. తన సుఖానికే ప్రాధాన్యమిచ్చింది. వైవాహిక జీవితంలో తనకే ప్రాపంచిక సుఖాలు దక్కాలనీ, తన కుమారుడే చక్రవర్తి కావాలనెడి ఆశతో భర్త మరణ విషాదాన్ని కూడా ఆమె లెక్కించలేదు.

సుమిత్ర మిత్రభావం కలది. రాజసగుణం లేదు సరికదా, ఏ రాణి హోదానూ అనుభవించలేదు – ఇద్దరు కుమారులు లక్ష్మణుడూ, శత్రుఘ్నుడూ అన్నకు దాస్యంలో ఉన్ననూ ఆమె దిగులు నొందలేదు సరికదా, వారు వారి అన్నలకు సేవ చేయడంలోనే ఆమె తృప్తిపడింది.

భరతుడు 'భరతాత్ భరతః' – కష్టాలను భరించే స్వభావం కలవాడు. భగవత్సేవను భగవదర్పణా భావంతో చేశాడు. రాజ్యపాలనను కూడా అంకిత భక్తితో 'భరణ' శక్తితో నెరపినవాడు.

లక్ష్మణుడు – 'లక్ష్మనయతి ఇతి లక్ష్మణః' అని రామచంద్రునికి నిరతము నీడలా ఉంటూ రామార్పణం గానే, భార్యా సుఖమును సహితమూ త్యజించి, రామసేవలో తరించినవాడు.

శత్రుఘ్నుడు – 'శత్రూన్ ఘ్నంతి ఇతి శత్రుఘ్నః'. శత్రువులను నాశనం చేసే శక్తిభావుడు అని అర్థమున్నది. భరతునితో ఉంటూ రాజ్యభరణశక్తికి శత్రునాశక మూర్తిగా ఉంటూ, అహరహమూ భరతుని సేవ చేస్తూ, తద్వారా భగవంతుడైన రామునికి కూడా పరోక్షంగా సేవ చేసినవాడు. అంటే రామచంద్రుడు తిరిగి అయోధ్యకు వచ్చేవరకూ రాజ్యాన్ని శత్రుదుర్భేద్యంగా కాపాడడంలో ప్రధాన బాధ్యత వహించినవాడు.

దీన్ని బట్టి సమీక్షిస్తే పితృ, మాతృ భక్తిలతో పాటు భ్రాతృశక్తి కూడా విశేషంగా విపులీకరించినది రామాయణం. అన్నదమ్ముల ఐకమత్యం, ఏకాభిప్రాయం కారణం గానే ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లాయి. ప్రజల మధ్య, రాజ్యాల మధ్య అవగాహన పెరిగింది. ప్రకృతి రక్షణ పెరిగింది. పశుపక్షి కీటకాదుల మధ్య సహకార విధానం పెరిగింది. ప్రపంచంలో శాంతి, సౌభాగ్యం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసింది. దశరథ సామ్రాజ్యం కారణంగా శరీరంలోని దశేంద్రియాలూ పటిష్టంగా ఉంటూ ఆరోగ్య సౌభాగ్యం కల్గించింది. రామరాజ్యం కారణంగా గ్రామరాజ్యం వర్ధిల్లింది. ప్రజలు తమ తమ వృత్తులను నెరపుతూనే పరస్పర మైత్రీ సహకార భావంతో వర్ధిల్లారు. ఇంతటి మహత్తర చరిత్ర కలది కాబట్టే మహిలో కొండలు, కోనలు, వాగులు, వంకలు ఉన్నంతకాలమూ 'రామాయణం' నిలుస్తుందనెడిది సత్యం. అందుకే రామాయణం ప్రపంచమంతటా, అన్ని భాషల్లోనూ వెలువడి, అందర్నీ అలరిస్తున్నది. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# శ్రీరామచంద్రుని అయోధ్యా నగర పునరాగమనము చైత్ర శుద్ధ పాడ్యమి నాడే జరిగింది



ధనుర్ధారి దశరథాత్మజుడైన శ్రీరామచంద్ర మూర్తి వనవాసమును ముగించుకుని, సీతాలక్ష్మణ సమేతుడై, అయోధ్యలో కాలిడిన శుభదినం చైత్ర శుద్ధ పాడ్యమి. అమ్మహామహుని అన్నమయ్య తన పదాక్షరములతో ఈ శ్రీరామవిభుడు రఘువంశాన జన్మించిన మహావీరుడు. ఆర్తుల ఆశ్రితుల శ్రితజనమందారుడు. గౌతమముని సతీమణి అహల్య శాపము బాపినవాడు. అపర సృష్టికర్త విశ్వామిత్రుని యాగ సంరక్షణ మొనర్చినవాడు. సీతాదేవికి చింతామణి. వాలిని సంహరించి సుగ్రీవుణ్ణి, రావణుణ్ణి సంహరించి విభీషణుణ్ణి కిష్కింధ, లంకా నగరముల కథిషిక్తుల్ని కావించిన వాడు. హనుమంతునికి భవిష్యద్బ్రహ్మ పట్టాన్ని కట్టినవాడూ ఈతడే. శబరికి ముక్తిని ప్రసాదించినవాడూ, గుహుణ్ణి ఆదరించి ఆలించినవాడూ ఈ రాముడే! కలడు కలడన్న వారికి కలడంటూ ప్రత్యక్షుడై అభీష్టములనుగ్రహించేవాడూ ఈతడే – అంటూ అన్నమయ్య పొగిడాడు.

**శ్రీరామరామ రామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే**

– అంటూ పార్వతికి బోధించాడు పరమశివుడు.

శ్రీరామ రామ రామ అని మూడు సార్లు స్మరిస్తే చాలు వేయి నామాల వేల్పుని ధ్యానించినట్లవుతుంది. రామశబ్దం యొక్క మహిమ అంతటి అత్యున్నత మైనది. రామనామం యావత్ప్రపంచాన్నీ తరింప చేస్తుందన్నారు యోగులూ, మునులూ, మహాభాగులూ!

**విమల కమలనేత్రం విస్ఫురన్నీల గాత్రం**
**తపన కుల పవిత్రం, దాసప ధ్వాన్త మిత్రం**
**భువనకుల చరిత్రం, భూమి పుత్రీ కళత్రం**
**మహితగుణ సముద్రం రామభద్రం నమామి**

– అంటూ సీతారామభరత లక్ష్మణ, ఆంజనేయ సహితుడైన శ్రీరామచంద్ర ప్రభువును ప్రార్థిస్తూ, ధనుర్ధారియైన శ్రీరామచంద్రమూర్తిని వికారి సంవత్సరంలో సర్వజనుల శ్రేయఃకాముడు శ్రీరాముడే కావాలని ఆరాధిస్తున్నారు.

'తెలుగుల పుణ్యపేటి' బమ్మెర పోతనామాత్యులవారు శ్రీరాముని కొలుస్తూ, శ్రీరాముని సేవలోనే తరించారు. దేశము రామరాజ్యమును తలపింపచేయాలని, పోతనవలె తెలుగు కవులు, రచయితలు ప్రజల్ని సమాజ శ్రేయోగాముకులుగా తీర్చిదిద్దేలా సాహిత్య పంటల్ని పండించాలనీ విశ్వసిస్తూ –

**పోతన దున్నిన నేలలో**
**కసువుగానైన గాకపోతిని!**
**పోతన నడచిన పొలిమేర లోపల**
**పాంశుతల్యంబైన బడయనైతి!**
**పోతన కాయగా బూనిన పశువులలో**
**పశుజన్మనైన బడయనైతి!**
**పోతన తిరిగిన పొలముల నీడల**
**తొలగింప తరువునై యుండనైతి!**
**ఆంధ్ర భాగవతము వ్రాయునవసరమున**
**గంటముగనైన జన్మంబుగించనైతి!**
**నంచు వాపోవు మావెతనపన్గయింప**
**రాగదే తల్లి! ఆంధ్ర రాష్ట్రమాత –**

అంటూ ధూపాడు వెంకట రమణాచార్యుల వారిలా తెలుగు భాషకు వన్నె గూర్చిన బమ్మెర పోతనగారిలా శ్రీరామచంద్రుణ్ణి ప్రార్థిస్తూ 'వికారి'లో అన్నివిధాలా తిరోగమనంలో ఉన్న దేశాన్ని పురోగమన దిశకు పయనింపచేయాలని ప్రార్థిస్తూన్నాం.

**రామచంద్రుడితడు రఘువీరుడు**
**కామిత ఫలితము లియ్యఁ గలిగె నందరికి**
**గౌతము భార్యపాలిటి కామధేను వితఁడు**
**ఘాతల కౌశికుపాలి కల్పవృక్షము**
**సీతాదేవి పాలిటి చింతామణి ఇతఁడు!**
**యీతఁడు దాసులపాలిటి ఇహపరదైవము**
**పరగ సుగ్రీవుపాలి పరమబంధు డీతఁడు**
**సరి హనుమంతుపాలి సామ్రాజ్యము**
**నిరతి విభీషణునిపాలి నిధానము**
**గరిమ జనకుపాలి ఘనపారిజాతము**
**తఁలప శబరి పాలితత్త్వపు రహస్యము**
**కలఁడన్న వారి పాలికన్నులెదుట మూరితి**
**వెలయ శ్రీ వేంకటాద్రి విభుఁడీతడు!** ●



# గోమాత యొక్క మహత్యము

గోమాత పరమ పవిత్రమైనది. మన హిందూ దేశంలో ఉన్న హిందువులు అందరు గోమాతను పూజిస్తారు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి మన సాంప్రదాయాలు, సంస్కృతులు తగ్గినా గోమాత అనగా ఒక పవిత్రమైన జంతువు అని అందరికీ స్ఫురణకి వస్తుంది. పర్వదినాలు, పండుగలు, కొన్ని పితృ కార్యాలలో ఆవు యొక్క ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది. సంక్రాంతి పండుగ రోజు ఆవుని పూజించడం ఇప్పటికీ ఎప్పటికీ ఉంటుంది. మన పూర్వీకులు ఉదయం లేవగానే స్నానం చేసి మొట్టమొదట పూజించే దేవత గోమాతే.

పూర్వీకులు అందరి ఇండ్లలో పాడి, పంట అన్నది సర్వసాధారణంగా ఉండేది. పశువులను కూడా ఆస్తిగా చూసేవారు. ఇప్పటికీ పల్లెల్లో పశుసంపదను సొమ్ములు అని పిలుస్తారు.

మనం లక్ష్మీదేవిని పూజిస్తాము. ఆవిడ పాలసముద్రంలోంచి పుట్టినదే కదా! ఆవుకు కొన్ని దైవిక గుణాలు ఉంటాయి. గోమాతకి కొన్ని ధర్మాలు ఉంటాయి. అదే ఆవు-పులి కథగా చిన్నపిల్లలకి చెబుతుంటాము ఇప్పటికీ. పుట్టిన పిల్లలకి తల్లి పాలు లేకపోతే ఆవుపాలను పట్టించమని వైద్యులు సలహా ఇస్తారు. ఇందులో నల్ల ఆవు పాలు చాలా శ్రేష్ఠమైనవని పెద్దలు చెబుతారు. ఇలా చెప్పుకుంటూ పోతే పురాణాల్లో ఆవు యొక్క ప్రభావము, మరియు దాని శ్రేష్ఠత గురించి అనేక కథలు లభిస్తాయి. మన పూర్వీకులు ఆవు పట్ల మహాభక్తులు. ఆవుని రక్షించుట, పూజించుట చేయనివాడు భారతీయుడు కాదు.

ఆవులను రక్షించుట కొరకై ప్రాణాలను అర్పించుట భారతీయులు మహా పుణ్యకార్యంగా భావిస్తారు. సాక్షాత్తు ఆ కృష్ణ పరమాత్ముడు చిన్నతనం నుంచి గోవులతో స్నేహం చేసి, వాటికి కాపరిగా ఉండి వెన్నను ఎంతో ఇష్టంగా తినేవాడు. బృందావనము, ద్రేపల్లె, ద్వారక అని ఆ ఊరి పేర్లను తలుచుకుంటేనే మనకి ఆవులతో ఉన్న చిన్ని కృష్ణుడి రూపం కళ్ళలో కదలాడుతుంది. గోమాత శరీరము ముప్పై మూడు కోట్ల దేవతలకు నివాసము. మరియు దాని సృష్ట అమృతము. ఈ ప్రపంచములో దేవతలు, దేవుళ్ళు ఎలాగో అలాగే గోమాతకు కూడా విశిష్టమైన స్థానము ఉంది. ఎందుకనగా మనము రైతు గొప్పవాడా, సైనికుడు గొప్పవాడా అని అడిగితే ఆలోచించి తీరవలసిందే. ఎందుకనగా ఒకరు దేశానికి అన్నం పెట్టే స్థానంలో ఉన్నవారు. ఒకరు దేశాన్ని రక్షించే స్థానంలో ఉన్నవారు. పాడిపంటను సమృద్ధిగా మనకు అందించేవాడే రైతు. బ్యాంకులో ధనం దాచుకుంటే ఎంత తృప్తి ఉంటుందో, అలాగే ఇంట్లో గోమాత ఉంటే ఇంట్లో దేవత ఉన్నట్లే కదా!

ఇంక పురాణాలలోకి వెళితే ఆవు యొక్క సృష్టి గురించి పురాణాలలో ఎన్నియో రకాల కథలు మనకు లభిస్తాయి. ఈ కథలలో ప్రథమంగా మనం తీసుకోవలసిన కథ ఏమిటంటే, ఎప్పుడైతే బ్రహ్మ ఒక ముఖముతో అమృతాన్ని త్రాగుచున్నాడో అప్పుడు అతని రెండవ ముఖం నుంచి అమృతం కొద్దిగా బయటకు వచ్చింది. అలా వచ్చినట్టి అమృతం నుండి కామధేనువు సృష్టి జరిగింది.

ఆ సురభినుండి పసిడి వర్ణంలోని తెల్లని నూగుగల ఒక ఆవు సృష్టించబడింది. దాని యొక్క క్షీరంతోనే క్షీరసాగరం ఏర్పడింది.

అలాగే మన సప్తర్షులలో విశిష్టమైన వ్యక్తిత్వం కల వశిష్ట మహాముని ఆశ్రమంలో నందిని అనే పేరు కల ఆవు ఉండేది. ఆశ్రమంలో ఎందరు వచ్చినా వారికి రుచికరమైన భోజనాన్ని అందించేది.

వేదాలలో గోమాతకు విశిష్టమైన స్థానం ఉంది. ప్రాచీన కాలంనుండి ఆర్యులు అవును చాలా ఎక్కువగా పూజిస్తూ, విశ్వసిస్తూ వస్తున్నారు. ఋగ్వేదం మరియు మిగతా వేదాలలో కూడా ఆవు యొక్క గుణగణాల గురించి మనకు వందలకొలది మంత్రాలు లభిస్తాయి.

గీతలో కృష్ణభగవానుడు ఆవుల్లో కామధేనువు "నేనే" అని అన్నాడు. శ్రీకృష్ణ భగవానుని గోపోషణ మరియు ఆవుల పట్ల అతనికి గల భక్తి ఎంతో ప్రసిద్ధి చెందినది. అందుచేతనే అతని పేరు గోపాలుడిగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆయనే స్వయంగా ఆవులను కాసేవాడు. ఆవులకు ఎన్నో సేవలు, పరిచర్యలు కూడా చేసేవాడు. ఆవులకు కష్టంగానీ కలిగించారో వారిని తప్పక శిక్షించేవాడు. దీనికి ఉదాహరణే ఆవులను రక్షించడానికి వచ్చిన కృష్ణపరమాత్ముడు చిన్ని కృష్ణుడుగా గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలుతో ఎత్తి స్వర్గాధిపతి అయిన ఇంద్రుని గర్వాన్ని అణచుట. భాగవతంలో ఈవిధంగా చెబుతారు. గోపికలతో శ్రీకృష్ణుడు రాసక్రీడలాడుతూ ఎప్పుడయితే వారు అలసిపోతారో అప్పుడు తన ఎడమభాగంతో ఆవును సృష్టించాడని, ఆ ఆవు యొక్క పాలతో ఒక జలాశయము తయారయిందని, ఆ తరువాత అందరూ ఆ పాలనే సేవించి వారి వారి అలసటను దూరం చేసుకున్నారని. కృష్ణ పరమాత్మకు గోపోషణ కారణము చేతనే అపూర్వమైన శక్తి ప్రాప్తించింది. దాని ప్రభావం చేతనే ప్రపంచాన్ని ఉద్ధరింప చేయడానికి గీతా జ్ఞానాన్ని వెల్లడించారు.

భవిష్య పురాణోత్తర పర్వంలో కృష్ణుడు ధర్మరాజుతో సముద్రమథన సమయంలో మాతృ స్వరూపులగు నంద, సుభద్ర, సురభి, సుశీల, బహుళ అనే ఐదు గోవులు ఉద్భవించాయని, వానిని వరుసగా దేవతలు, జమదగ్ని, భరద్వాజ, వశిష్ట, గౌతమ మొదలగు మహర్షులకు లోక కళ్యాణార్థం యజ్ఞముల ద్వారా దేవతలను తృప్తిపరచ సమర్పించారని, ఇన్ని కోర్కెలన్నింటిని తీర్చగలవవడం వల్ల వీనిని కామధేనువు లన్నారని కృష్ణుడు, ధర్మరాజుతో చెప్పాడు. ●

---

**రాయలసీమలో క్షామము వచ్చినప్పుడు ఒక అజ్ఞాత కవి.**

**రాయలేలిన సీమ రతనాల సీమ**
**రాళ్ళు దప్ప రత్నాలు లేవురా**
**కన్నీళ్లు దప్ప తాగే నీళ్ళు లేవురా**

అంటే యింకో కవి

**క్షామము దాపురించి పలుమారులు చచ్చెను జంతుసంతతుల్**
**వేమరు జచ్చినారు ప్రజలు వేనకువేలు చరిత్ర లోపలన్**
**క్షామము లెన్ని వచ్చినా రసజ్ఞత మాత్రము చావలేదు జ్ఞా**
**నామృత పుష్టికిన్ కొరత నందని రాయలసీమలోపలన్**

కన్నీరు,మున్నీరు,పన్నీరు,తేనీరు అనే పదాలను యిచ్చి రాయాలసీమ లో నీటి కోసం రాముడిని ప్రార్థించ మని అడిగారు అవధానం లోడా. నా.ఫ. శర్మ గారి పూరణ


**కన్నీరున్ దిగ ద్రావలేము గదరా గంభీర మేఘా కృతీ**
**పన్నీరౌ నీ కడగంటి చూపు చిలుకన్ భద్రాంగ జాగేలరా**
**మున్నీరై చను సీమ జీవితములో ముత్యమ్ము నీ చూపే రా**
**తిన్ నాతిన్ గలిగించు వాడ ఘనుడా! తేనీరు రామప్రభో**

రాతినుంచి నాతిని పుట్టించినావు గదా!నీళ్ళు పుట్టింప లేవా? అన్ని పాదాలలోనూ నీటిని గురించిన విశేషణం వాడారు.మేఘం లో నీళ్ళుంటాయి భద్రాంగవ తుంగభద్ర, మున్నీరు అంటే సముద్రము.

(అనంతపురం జిల్లాలోని కుంటిమద్దిలో అనంతాచార్యులు అనే అనంతావధాని వుండేవాడట, శతావధాని సహస్రావధాని కాదు. అనంతావధాని)

# కాళోజీ ఊర్ధ్వ దృష్టి!

**అన్య భాషలు నేర్చి, ఆంధ్రమ్ము రాదంచు సకిలించువాడా చావవెందుకురా - అన్న గుండె ధైర్యం కల కాళోజీ**



ఆయన తెలంగాణా వాడు. 'తెలుగు తల్లి పట్ల, తెలుగు భాష పట్ల' అపార భక్తి ప్రపత్తులు కలిగిన వాడు. ఎవరినీ లెక్క చేయనివాడు. ఏ ఉద్యోగమూ చేయలేదు, ఎవరి చేతి క్రిందా చేయి చాచలేదు. సర్వ స్వతంత్రుడు. కుళ్ళూ కుచ్చితములనేవి పారేయడానికే కలం పట్టాడు. కలాన్ని కత్తిలా దూసిన ఒకే ఒక రచయిత. అతడే కాళోజీ!

కాళికా ప్రసన్నుడేమో నేనెరుగ కానీ - కాళీ కత్తి దూసినట్టే అతని కలం కత్తి దూసింది. రోషాన్ని పలికించింది, దోషాన్ని ఎత్తి చూపింది. గుండె ధైర్యమున్న నిండు మనిషి. పి.వీ. నరసింహారావు కత్యంత ప్రియతముడు, అవసరమొచ్చినప్పుడు అతని పైననే కలం దూసినవాడు. కాళోజీ రజాకార్ల గూండాల కళ్ళల్లో నిప్పురవ్వలు రేపినవాడు. ఖలేజా ఉన్న ఏకైక కవి.

కాళోజీని గురించి చెప్పాలంటే ఎంతో చెప్పాలి. ఆయన మరాఠీ మాతృభాష గల వంశీకుడైనా, తాను పుట్టింది తెలంగాణా యనీ, ఆ తెలంగాణా మాతృభాష 'తెలుగే'నని ఆ తెలుగునే చివరి 90 దశకం వరకూ (ఆయన చివరి శ్వాస వరకూ) ఆరాధించాడు. ఆయన పుట్టిన గడ్డ మీద ఉర్దూ మాధ్యమం. పుట్టి పెరిగింది నైజాం నవాబు పాలనలో ఉన్న నైజాం, జనన మందిన ప్రదేశం హనుమకొండ. ఆ భూమిపై ప్రసరించే గాలిలో, ప్రవహించే నీటిలో, ప్రకృతిలోని పువ్వుల్లో, ఆకుల్లో కాయల్లో - ఏది స్పృశించినా తెలుగే ధ్వనిస్తోందనీ, తెలుగే ప్రతిధ్వనిస్తూన్నట్టు ఆయనకు అనిపించేది. ఆయనకు తెలుగుపై అపారమైన మమత, అమేయమైన అనురాగం జనించింది. అక్కడి జనం గళం అంతా తెలుగుదనంతో పరవశించిపోయేవారు. ఆయన ప్రజల కవి. అనవరతమూ ప్రజల కోసమే పరితపించేవారు. ఆయన్ను కవితావేశం గల వేమనయని కూడా నుతించవచ్చు!

**ఎందుకో నాకిన్ని ఆవేదనలు**
**అవనిపై జరిగే అవకతవకలు జూచి -**
**పరుల కష్టము చూచి పగిలిపోవును గుండె**
**మాయ మోసము జూచి మండిపోవును ఒళ్ళు**
**పతిత మానవుని జూచి చితికిపోవును మనసు**
**అంటూ మరొకచోట**
**ఒక్క సిరా చుక్క వేయ మెదళ్ళకు కదలిక**
**అన్యాయాన్ని అందరమూ కలిసి ఎదిరించాలి.**

ఒకళ్ళు ఎక్కువ ఒకళ్ళు తక్కువ అనే మాట పోవాలి అంటూ సర్వజన సమానత్వాన్ని ఆకాక్షించారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినమా, నైజాములోని తెలంగాణా వాడికి సిద్ధించలేదు సరికదా నిజాం నవాబుల రాక్షసపాలనం సాగింది. హిందూ ద్వేషం పెరిగింది. స్త్రీలపై అత్యాచారాలూ, దురాగతాలూ, క్రూర కృత్యాలూ, రజాకారుల దురంతాలూ విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి. కాళోజీ నారాయణరావు గారు ఖైదీగా బందీయై ఉన్నారు. అది 1948వ సం?ము. జైలు నుంచే ఆయన ఈ గీతం వ్రాశారు!

**మన కొంపలార్చిన మన స్త్రీల చెరచిన**
**మన పిల్లలను చంప మనల బంధించిన**
**మానవాధములను మండలాధీశులను**
**మరిచిపోకుండగ గురుతుంచుకోవాలి**
**కసి ఆగిపోకుండ బుసగొట్టుచుండాలి**
**కాలంబు రాగానె కాటేసి తీరాలి**
**సత్యమహింసయని సంకోచపడరాదు.**
**దయయు ధర్మంబనుచు తదుముకోపనిలేదు.**
**కాలంబు రాగానె కాటేసి తీరాలి**

- అంటూ ఆయన ప్రజల్ని ప్రబోధించిన గీతాలు అన్నీ ఇన్నీ కావు. ప్రజలను కోస్తున్న ఊచకోతను చూచి

**హింస తప్పు రాజ్యహింస మరీ తప్పు**
**ప్రతిహింస తప్పు కాదన్నారు ఆయన**

అధికారానికి, అధికారులకూ దాసోహమంటూ దొంగ దొంగ దండాలు పెట్టడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. అణగి మణగి ఉండే మనస్తత్వం అంతకన్నా కాదు. కవి స్వతంత్రుడు. అవసరమొచ్చినప్పుడు 'వజ్రం'లా ఉండాలి, పదును గల కత్తి ఝుళిపించినట్టు పదాలుండాలి. కుంగిపోకూడదు, భావదాస్యుడు కారాదు, ఆత్మగౌరవాన్ని నిలుపుకోవాలి. కుంగిపోరాదు. కొత్త కొత్త అన్వేషణమును సాగించాలి.

**నాది నిత్య నూత్న వికసిత జ్ఞానం**
**మీది బుద్ధి జాడ్య జనితోన్మాదం** - అన్నారు అల్లసాని పెద్దనలా. ఆయనలాగే మను చరిత్రలో 'బుద్ధిజాడ్య జనితోన్మాదుల్ కదా శ్రోత్రియుల్' అంటారు కదా.

'తప్పు'ను తప్పుగా చెప్పడంలో తప్పు లేదనే కాళోజీ ఎం.ఎల్.సి. గా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి గారి బడ్జెట్ ను చక్కగా చిక్కని పదాలతో




ఎలా విమర్శించారో చూడండి.

**కాసు మాయలో అంకెలు**
**బ్రహ్మానందము బడ్జెట్**
**బహురూపులని ప్రణతతో**
**బ్రహ్మాంతటివీ అంకెలు –**

అంటూ బడ్జెట్ ను బహు చమత్కృతితో విమర్శించారు. ఆయన గాంధేయుడే అయినా శాంతంగా సాగిపోలేదు. సామ్యవాదుడైనా కమ్యూనిస్టు కానే కాదు. కులమతాల వంటి ఛాందసాలను ఖండించినా నాస్తికుడు కాదు. 'నా విష్ణుం పృథ్వీపతిః' అనే సిద్ధాంతి కాదు. రాజును ప్రశ్నించవచ్చుననే స్వభావం కాళోజీ వారిది.

దేశాన్ని పాలించిన ప్రధాని పి.వి. నరసింహారావు వారి అనుంగు మిత్రులే – తప్పు జరిగినప్పుడు విమర్శించడంలో ఆయన వెనుదీయలేదు. 1974 సం?ములో కాళోజీ వారి షష్ట్యబ్దిత్సవం పి.వి. నరసింహారావు గారి అధ్యక్షతన మహోన్నతంగా జరిగింది. కాళోజీని పి.వి. బహుముఖంగా ప్రశంసించారు.

కాళోజీ గ్రంథాలు 'అణాగ్రంథమాల' ద్వారా ప్రచురితమయ్యాయి. ఓ బృహద్గ్రంథం 'కాళోజీ గొడవ' రూ. 200లకు విక్రయించపడింది. వీరి మిత్రులు 'కాళోజీ ఫౌండేషన్' నెలకొల్పి ఆ గ్రంథాన్ని ప్రచురించారు. కాళోజీ రచనలో వైచిత్రి ఉంది అనడానికీ ద్విపదే సోదాహరణం!

**పుటుక నీది చావు నీది**
**బ్రతుకంతా దేశానిది**

– అన్నారొకచోట. అనేక ద్విపదల్ని వ్రాశారు. కొన్ని కొన్ని ద్విపదలు కఠినంగా, వజ్రఘాతంలా ఉంటాయ్!

**ఏ భాషరా నీది ఏమి వేషమురా**
**ఈ భాష ఈ వేషమెవరి కోసమురా?**
**అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు**
**సకలించు ఆంధ్రుడా! చావవెందుకురా!**

– అన్న ధీశక్తి ఎవరికి ఉంటుంది? ఏ కవికి ఉంటుంది, ఒక్క కాళోజీ మహాకవికి దక్క!

అరవై రెండు సంవసంవత్సరాల కవితా సేద్యం చేసి, తొమ్మిది పదుల జీవితాన్ని చూచిన తెలంగాణా కత్తి వీరునికి 'ప్రముఖాంధ్ర' కృతజ్ఞతాంజలి ఘటిస్తూంది.

**కూలిపోయిన కోటగోడలను చూసి**
**శిథిలమైన గుళ్ళశిల్పములు చూసి**
**పురుగుపట్టిన తాటిపొత్తములు చూసి**
**తుప్పు పట్టిన కత్తితునకలను చూసి**
**కుంగిపోకు, భావదాస్యం వీడి**
**ఆత్మగౌరవము నిలబెట్టుకోవోయి**

– అన్న ధీరవీర కవిపుంగవుడు కాళోజీ నారాయణరావు తెలంగాణాలో పుట్టి, తెలంగాణాలో పెరిగినా, తన కవితలతో యావత్తెలుగుల గుండెల్నీ తట్టి లేపిన ప్రజాకవి, ప్రాతః స్మరణీయుడు. ●






## మన పద్యాలలో తెలుగు వెలుగు

మన అమ్మనుడి (మాతృభాష) తెలుగు, వెలుగు జిలుగుల పలుకుల కులుకులాడు భాష. అందాల అజంత భాష. అనంత అజంతా చిత్రాల భాష. అమర భావాల భాష ఆంధ్ర భాష. అందచందాల అక్షరాల సులక్షణ భాష. అమృత నుడుల వలపు, సామెతల విరుపు, నీతి శతకాల మెరుపు, పంచ కావ్యాల ఇంపు సొంపులు, కవన విజయాల కైతల కెంపులు, ఎన్నెన్నో వింత వింత పులకింతల సాహితీ ప్రక్రియలు తెలుగు వారికే సొంతం.

ఆ సాహితీ ప్రక్రియలో ఓ గొప్ప సుక్రియ మన తెలుగు పద్యం. పద్యం తెలుగు వారి ఆస్తి, సూక్తి, ముక్తి, రక్తి, భక్తిదాయకం. పద్యం తెలుగు వారి జీవితంలో ఓ భాగం. సంస్కృతిలో అంతర్భాగం. పద్య పఠన వలన జ్ఞానం పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అమ్మనుడిపై నెనరు (ప్రేమ) కలుగుతుంది. భాషా సౌందర్యం తెలుస్తుంది.

కన్నడంలో, తమిళంలో పద్యాలు ఉన్నాయి. హిందీలో దోహాలు, చేపాయిలు ఉన్నాయి. సంస్కృతంలో శ్లోకాలు ఉన్నాయి. వీటి రూపాలు ఒకటే అయినా, వాటికి యతులు, ప్రాసల సొగసులు లేవు. అవి మన తెలుగు భాషకే సొంతం. అష్ట, శత, సహస్రావధాన ప్రక్రియలు కూడా తెలుగు వారికే సొంతం.

మన పూర్వ కవులు అనేక ప్రయోగాలు పద్యాలతో చేశారు. ఒకే పద్య కావ్యంలో రెండు, మూడు పురాణాలను వివరించారు. వాటినే 'ద్వ్యర్థి' కావ్యమని, 'త్ర్యర్థి' కావ్యమని అంటారు. అలాగే ఒక పద్యంలో రెండు, మూడు పద్యాలు ఇమిడి ఉంటాయి. వాటినే 'గర్భ కవిత్వం' అంటారు. అటువంటి గర్భ కవిత్వపు పద్యం ఒకటి పరిశీలిద్దామా! చాలా తమాషాగా ఉంటుంది.

### గర్భ కవిత్వం

ఈ దిగువ వ్రాసిన 'ఉత్పలమాల' పద్యంలో ఒక కంద పద్యము, మరొక తేటగీతి పద్యము దాగి ఉన్నాయి. పరిశీలించి ఆనందించండి.

**ఉత్పలమాల**

మా తెలుగే కదా వరము మాకిల తీయని భాషయన్న, యా
మా తెలుగే సదా పలుకు మాటల తేనెల పాలవెల్లి కా
గా, తెలుగందు మా ఘనత కైతల కన్నియ కాంతులెన్నొ, తా
నే తలపై తెలుగు నేలల మా నుడి తేజరిల్లునే

**తేటగీతి**

వరము మాకిల తీయని భాషయన్న
పలుకు మాటల తేనెల పాలవెల్లి
ఘనత కైతల కన్నియ కాంతులెన్నొ
తెలుగు నేలల మా నుడి తేజరిల్లు

**కందము**

తెలుగే కదా వరము మా
కిల తీయని భాషయన్న యా మా తెలుగే
తెలుగందు మా ఘనత కై
తల కన్నియ కాంతులెన్నొ తానే తలపై

– రాఘవ మాస్టారు, బెంగళూరు, 09741407099

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# వస్తాదు కోడి రామమూర్తి

కోడి రామమూర్తి నెదిరించువారు కోటి కొక్కడైనా కనబడలేదందురు – గువ్వలచెన్నా – యనే ఆర్యోక్తి ఉంది. నింగి నిండీ వడివడిగా జాలువారిన గంగను కండువా చెంగుపట్టి ఆపగల ప్రజ్ఞావంతుడు. కలియుగ భీముడు, తేలిగ్గా కదిలే పాదరసాన్ని సహితమూ, కనుచూపులతో కట్టిపెట్టగల ధీశాలి – యెవరయా అంటే రక్కున కోడి రామమూర్తియని చెబుతారు. అజేయుడు, విజేయుడు, పహిల్వాన్, మహాబలుడు, అతడు సవాల్ చేసి పాల్గొన్న కుస్తీలు, మల్లయుద్ధాలు, సర్కస్ విన్యాసాలు, వ్యాయామ క్రీడల్లో కండలు తిరిగిన వస్తాదులు సహితమూ విజయులు కాలేకపోయారు.

మత్స్య యంత్రమును కొట్టిన అర్జునునిలా అతని మేధాశీలత్వం, మహా బలాఢ్యతకు తోడయింది. దేశ విదేశాల్లో గల ప్రతిష్ఠాత్మక పహిల్వాన్ లతో తలపడి ఎన్ని విజయాలను సంపాదించాడో, ఎన్ని పతకాలను పొందాడో, ఎన్ని సత్కారము లందుకున్నాడో యనేదిది లెఖ్ఖగట్టి చెప్పడం కష్టం.

తనకు తానే తయారు చేసుకున్న ప్రతిభా సంపత్తి, నిత్యమూ దండీలు, బస్కీలు తీస్తూ, మద్రాసులోని సైదాపేటలో ఓ సంవత్సరం పాటు వ్యాయామ శిక్షణ నొంది, ప్రాణాయామం చేస్తూ జలస్థంభన, వాయుస్థంభన అలవరచుకుని, తన కండపుష్టిని, ఆత్మవిశ్వాసాన్నీ దృఢపరుచుకున్న శక్తి సంపన్నుడు. 'రామ్మూర్తి సర్కస్' పేరిట సర్కస్ కంపెనీని నెలకొల్పుకుని ఆంధ్రదేశమంతటా పర్యటించారు. తొలి ప్రదర్శనను విజయనగరంలోని అయ్య కోనేరు గట్టున గల ఆంజనేయస్వామి ఆలయం ముంగిట జరిపి, ఆయన ఆశీఃబలంతో దేశసంచారం చేశారు. తునిరాజా వారి బల ప్రదర్శనముల్లో పాల్గొని, ప్రథమ విజేతగా పేర్కొనబడి 'సెహబ్బాష్' అనిపించుకున్న మహాబలుడు. వస్తాదు అంటే కోడి రామమూర్తేనని అతనికి సరిరారెవ్వరనీ అనిపించుకున్న వస్తాదు. ఆయన పేరు ఆంధ్రులనూ, ఆంధ్ర సరిహద్దులనూ దాటిపోయింది. 1911 సం॥ము డిసెంబరున రామ్మూర్తి మద్రాసు వెళ్ళడమూ, అదే సమయంలో ఆరవ జార్జ్ చక్రవర్తి అక్కడే ఉండడం, వారి ఎదుట 'కోడి' వారు ప్రదర్శన ఇవ్వడమూ జరిగింది. ఎందరో మల్లయోధులు అక్కడ ఉన్నారు. తెల్లదొరలూ, ఇంగ్లాండు నుంచీ విచ్చేసిన ఉద్యోగులూ కొలువుదీరారు. ఆ సమయంలో అతి బలమైన ఉక్కు గొలుసులను తన ఛాతీకి బిగించుకుని, ఊపిరి బిగబట్టి, ఛాతీకి బిగించుకున్న గొలుసులన్నిటినీ తాడును తెంపినట్టు తెంపివేశాడు. రెండు బలమైన మోటారు కార్లను ఎంతో వేగంగా డ్రైవర్లు రామ్మూర్తి పైకి దొర్లించడానికి ప్రయత్నించినపుడు, రామ్మూర్తి తన ముష్టిని బలంగా నిలిపి వీసమెత్తు కూడా కదలనీయలేదు. ఎద్దులబండి నిండా ఇనుమును ఎక్కించుకుని తన కంఠం మీదుగా నడిపింపజేసుకున్న ఘనత కూడా రామ్మూర్తి గారిదే! తన వక్షస్థలంపై 1 1/2 టన్నుల ఇనుపరాయిని పెట్టించుకుని, బలాఢ్యులు సమ్మెటలతో కొట్టినా చలించ లేదు. తన ఛాతీపై ఓ బల్లను పెట్టుకుని, బలిష్ఠమైన గజరాజుని కొద్ది నిముషాలు పెట్టించుకున్నారు. ఇలా ఇలా ఎన్నెన్నో విన్యాసాలుచేసి ఆరవ జార్జి చక్రవర్తి మెప్పునూ, ఆయన అధికారగణం మెప్పునూ పొందిన కీర్తి దేశవిదేశాల్లోనూ మారుమ్రోగింది.

బాల్యంలో చదువు సంజెలు అబ్బని రామ్మూర్తి కుస్తీలు, మల్లయుద్ధాలందు ఆరితేరారు. ప్రపంచ మల్లయోధుల ప్రశంసలందారు. అలాగే సాటివారిలో ఈర్ష్య అసూయలను పెరగడానికి కారకుడయ్యారు. ఆయనకు రంగూన్ లో అపూర్వమైన స్వాగతం, సత్కారం లభించినట్టుగానే 'ఘలక్' నగరంలో ఓ యోధుడు మంచి మాటలతో తమ యింటికి పిలిచి పాలలో విషం కలిపి యివ్వగా, ఆరగించిన ఆయన వ్యాయామ బలంతో విషాన్ని గ్రక్కి మృత్యువు నుండి బయటపడ్డారు. ఇలాటి సంఘటననే ఓసారి సినీ, నాటక నటుడు, ఈలపాట గాయకుడు రఘు రామయ్య నాకు చెప్పారు. అలాగే రంగూన్ లో సయ్యద్ సోదరులు మూడవ మిద్దె పైకి తీసుకుని వెళ్ళి బాకులు, బల్లెములతో దాడులకు దిగారు. వాటన్నిటిని రామ్మూర్తి నిభాయించుకొనేసరికి పిస్తోల్ తీసుకుని కాల్చ చూడగా, అది జూచి రామ్మూర్తి పిడికిలి బిగించి, వారి పొత్తి కడుపులో ఒక గుద్దు గుద్దేసరికి అతడు నేలకొరిగాడు. మహాబలుని గానూ మహా వీరునిగా పేరు ప్రఖ్యాతులు దిగ్దంతాలూ వ్యాపించాయి.

భారతదేశం తిరిగివచ్చి మైసూర్ మహారాజుగారి ఆహ్వానంపై వారి సమక్షంలో రామ్మూర్తి అనేక సాహస విన్యాసాలు చేసి మహారాజు మెప్పులందు కోవడమే గాకుండా, ఆయన తనవద్దనే ఉండమని కోరారు. తన విద్యను దేశం నలుమూలలా ప్రదర్శించాలనుకుంటున్నా ననెడి తపన కలవాడినని చెప్పడం, రాజా వారు సంతోషంతో అనేక కానుకలిస్తూ, ఘన సత్కారం చేసి పంపారు. అలా రాజులూ, జమీందార్లూ ఎందరో రామ్మూర్తిగార్ని సత్కరించారు. గ్రామ గ్రామాన, పల్లెపల్లెనా ప్రదర్శనలిచ్చి బొంబాయి నగరము చేరుకుని, జాతీయ నాయకులు బాలగంగాధర్ తిలక్ గారి వద్ద రామ్మూర్తి ప్రదర్శన ఇచ్చారు. రామ్మూర్తి ప్రదర్శనను తిలకించి, అబ్బురపడి, ఆనంద తన్మయత్వంతో "కలియుగ భీమ" బిరుదమును ప్రదానం చేసి ఆశీర్వదించారు.

పాశ్చాత్య దేశాలైన ఫ్రాన్సు, ఇటలీ, ఇంగ్లాండు, జర్మనీలతో బాటు రష్యా కూడా పర్యటించారు. ఓ దేశంలో ఎనుబోతులను భుజాల కెక్కించుకునే పందెంలో, రామ్మూర్తి తాళ్ళు కట్టిన ఎనుబోతులను మోసుకుని, 11 మెట్లనూ అవలీలగా ఎక్కారు. అందరూ ఆశ్చర్యపోయారు. ప్రపంచ వీరుడు 'గామా' రామ్మూర్తి గారితో తలపడాలని భావించినపుడు జడలుగా అల్లిన గునపాలను, గొలుసూ, బంతులను బంతాటలా ఆడించడం చూచి, 'గామా' సంభ్రమాశ్చర్యాలతో రామ్మూర్తితో తలపడే ఉద్దేశమును విరమించి, ఆయనతో బాటు ఆంధ్రదేశం వచ్చి, విజయనగరంలో కొంతకాలం గడిపారు.

ఆయన చిన్నప్పుడు ఏమీ చదువుకొనకపోయినప్పటికినీ భారతీయ భాష లన్నిటితో బాటు, ఆంగ్లాన్ని కూడా అనర్గళంగా మాట్లాడడం నేర్చుకున్నారు. పేరు "కోడి రామ్మూర్తి" పేరే గానీ ఆయన కోడిమాంసంగానీ, మరే యితర మాంసాన్నీ ముట్టేవారు కాదు. ఆయన తినేదంతా శాఖాహారమే. ఒక్క గుడ్డు మాత్రం తినేవారు. ఎక్కువగా చపాతీ, పెరుగు అన్నం, బాదం పాలు, ఆకుకూరలు, కాయకూరలు, పళ్ళరసం, నెయ్యి తీసుకునేవారు. రోజూ ఉదయం 11 గంటల వరకూ వ్యాయామం చేసేవారు. స్నానానన్తరం రెండు శేర్లు బాదం పాలు, అర్ధశేరు మలాయి, చపాతీలో పప్పు వేసుకుని తినేవారు. ఆయనకు పెరుగు అన్నంతో వడియాలు, తెలకపిండి ఇష్టంతో ఆరగించేవారు. రాత్రి 8 గం॥ల భోజనంలో చపాతీ, బాదంపాలు, పళ్ళరసం ఏమీ తీసుకునేవారు కాదు. బలమే జీవితమనీ, బలహీనమే మరణమనీ ఆయన తన వాళ్ళకు బోధిస్తూండేవారు.

(తరువాయి 16వ పేజీలో)

# తెలుగు పద్యంలోని చమత్కారం

గుఱ్ఱపు డెక్కల చప్పుడు వచ్చేటటువంటి పద్యం ఒకటి వ్రాశాను. "అశ్వగతి" వృత్తమని ఉంది మనకి. ఈ "అశ్వగతి" వృత్తములో 'భ' గణాలు ఇన్ని ఉండవు. దానికన్నా "మానిని" వృత్తంలో అయితే ఎక్కువ ఉంటాయి. అందుకని ఇదైతే ఇంకా బావుంటుందని ఇది ఎన్నుకున్నాను నేను. ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలు కావు. ఛందస్సు తెలిసిన వాళ్ళకే తెలుస్తుంది. వాళ్ళు కూడా దీనిని ఈ దృష్టితో చూడరు కదా!

వెంకటేశ్వర స్వామి అశ్వ వాహనం మీద ఎక్కాడు. ఆ గుఱ్ఱానికి ఏమనిపించిందంటే ఇక్కడ కూర్చున్న ఈ పండితులందరూ వెంకటేశ్వర తత్త్వాన్ని ప్రచారం చేస్తున్నారు. నేను కూడా చెప్పాలి అనుకుంది. అయితే స్వామి తన మీద ఎక్కినప్పుడు మాట్లాడితే మర్యాదగా ఉండదు కదా! అందుకని అదేం చేసిందంటే తను వెడుతున్నప్పుడు డెక్కల చప్పుడు వస్తుంది కదా! ఆ డెక్కల చప్పుడులో నుండి పద్యం వచ్చేలా చేసింది. అది తెలివి గల గుఱ్ఱం. తెలుగు వచ్చిన గుఱ్ఱం. తిరుపతిలో ఉంటుంది కదా! అది వెడుతున్నప్పుడు ఒక పద్యాన్ని సృష్టించింది.

**న"మానిని" వృత్తమున**

**మ్రొక్కుడు మ్రొక్కుడు మ్రొక్కుడు మ్రొక్కుడు మ్రొక్కుడు తిర్ మల మూరితికిన్**
**మ్రొక్కగ మిమ్ముల బ్రోవగ నెక్కుచు మూపున గ్రక్కున పొమ్మనునన్**
**చిక్కిరి బిక్కిరి చిక్కుల దీర్పగ శ్రీలను గూర్పగ శీఘ్రముగాన్**
**ఎక్కడి కక్కడ ఎప్పటి కప్పుడు ఎవ్వరు బిల్చిన నేగునురా!**

ఇలా దీనికి బాగా మంచి పేరొచ్చింది. అలా అలా ఈ వార్త అన్ని దేశాలకూ చేరి పైన స్వర్గానికి తెలిసింది. అందరూ ఆనందించారు. కానీ ఐరావతం మాత్రం బాధ పడింది. అరెరే! సృష్టిలో ఉన్నది నేనొక్కదాన్నే తెల్ల ఏనుగుని, ఐరావతాన్ని. నాకు రావలసింది పేరు. కనీసం ఇంద్రుడి ఉచ్ఛైశ్రవానికి కూడా వస్తే పర్వాలేదు. అదేదో సాధారణ గుఱ్ఱం. దానికి వచ్చేసింది పేరు. దాని గురించి చెప్పుకుంటున్నారు అందరూ అని అది ఆలోచించింది. ఎందుకొచ్చింది దీనికి పేరు అని! తెలుగు పద్యం చెప్పటం వల్ల అని తెలుసుకుంది. ఇప్పుడు ఇదేం చేసిందంటే అల్లసాని పెద్దన దగ్గరికి వెళ్ళి తెలుగు నేర్చుకుంది. దానికి ఒక రెండు మూడు రోజుల్లో తెలుగు భాష మొత్తం వచ్చేసింది. ఎందుకంటే ఎలిఫెంట్ మెమోరీ అంటారు కదా! చెప్పింది చెప్పినట్టుగా దానికి జ్ఞాపకం ఉంటుంది. పైగా దానికి సంస్కృతం వచ్చు. అక్కడినుంచి అదేం చేసిందంటే, అదెక్కడ పేరు తెచ్చుకుందో అక్కడే మన ప్రతాపం చూపిద్దామని అది సరాసరి అలా స్వర్గం మీద నుంచి కిందకు దిగింది. అది తిరుమలలో కాలు పెడితే దిగచ్చు. డైరెక్ట్ గా తిరుమలకి వెళ్ళిపోతుంది. కానీ స్వర్గం నుంచి మొట్టమొదట పాదం అక్కడ మోపితే అపవిత్రం చేసినట్టవుతుంది. అందుకని తిరుపతిలో దిగి భక్తులతో పాటు కొండెక్కుతూ వెళుతోంది. అదివరకు అదృశ్య రూపంలో వెళ్ళేది. ఇప్పుడు అందరికీ కనిపిస్తూ వెడుతోంది. ఎందుకంటే తనొచ్చిన విషయం అందరికీ తెలియాలి కదా! తెల్ల ఏనుగు... తెల్ల ఏనుగు... అని పిల్లలందరూ దాని వెంబడి పడ్డారు. సరే, అరటిపళ్ళు పెడితే ఆశీర్వదించింది. మాటా మాటా కలిపి మీరెక్కడి నుంచి వస్తున్నారు అని అడిగితే స్వర్గం నుంచి వస్తున్నాను అంది. ఇంకా, ఎప్పుడు వస్తుంటారు మీరు? సంవత్సరానికి ఎన్నిసార్లు వస్తారు? ఇదేగా అడిగేది. అది దాని షెడ్యూల్ చెబుతోంది. ఎలా వచ్చింది, ఎలా వెళుతుంది, ఏమిటి అనేది. స్వామిని దర్శించే దాని కార్యక్రమాన్ని ఒక పద్యంలో చెప్పాలనుకుంది. ఎందుకంటే అది వెళ్ళిపోయిన తర్వాత కూడా ఆ పద్యాన్ని ఇక్కడ అందరూ చెప్పుకోవాలి. అది అందరూ చెప్పాలంటే ఏం చెయ్యాలి అని ఆలోచించింది. ఇక్కడ 'పాడుతా తీయగా', 'ఎందరో మహానుభావులు' ఇట్లాంటి కార్యక్రమాలు జరుగుతాయి. పిల్లలందరూ దాంట్లో ఉంటారు. వీళ్ళు పాటలు పాడుతారు కనుక ఆ పాటల కార్యక్రమంలో తబలా ఉంటుంది. తబలా లేకుండా పాటలు ఉండవు. కనుక తబలా నడకలాగా ఒక పద్యం చెప్పేసి వెళ్ళిపోతే వీళ్ళు ఎక్కడెక్కడ పాటలు పాడుతుంటారో అక్కడ తబలా ఉంటుంది కదా! ఇది తెల్ల ఏనుగు చెప్పిన పద్యమని మళ్ళీ మళ్ళీ చదువుతుంటారు కదా! ఊరికే చెప్పి వెళ్ళిపోతే ఎట్లా... అని ఆలోచించి దాని కార్యక్రమ ప్రణాళిక అంతా ఒక కంద పద్యంలో చెప్పింది.

**నకందమున**

**ధర కిట దిగి గిరి కట చని**
**మరకత పతకపు పతి గన మతి నతులిడుచున్**
**తరి తగ త్వరితగ తింతగ**
**తిరిగెద తిరిగెద తిరిగెద తిరుపతి దరికిన్!**

ఇది కంద పద్యం. అది ఏమంది? ధరకు ఇట దిగి, గిరికి అట చని, ఆ మరకత పతకం ధరించిన వెంకటపతిని కనగా, మనస్సులో నమస్కారాలు చేస్తూ, దరిశన సమయానికి తగ్గట్టుగా, త్వరితగతిని ఇంతగా తిరుపతి దరికి తిరిగెదను అని. అంటే ఇప్పుడు నా ఉద్దేశ్యం ఏమిటంటే, గుఱ్ఱము, ఏనుగు జంతువులు. అవే తెలుగు భాషకి ఇంత సేవ చేస్తున్నాయి. మనుషులం మనమెంత చెయ్యాలి అని...●

---

(15వ పేజీ తరువాయి) దేశవిదేశాల్లో తెలుగుతేజాన్ని వికసింపచేసిన ఈ కలియుగ భీముడు అజన్మబ్రహ్మచారి. తన వృత్తికీ, ఆశయానికీ వివాహం అడ్డంకి అవుతుందని వివాహం చేసుకోలేదు. విరోధుల కుయుక్తుల్నీ కుతంత్రాల్నీ, విషప్రయోగాల్నీ ఎదిరించి, ఎదురొడ్డి నిలబడ్డ ఈ ధీశాలి, విధినెదిరించలేకపోయాడు. రామ్మూర్తి గారి కాలుపై ఓ చిన్న కురుపు లేచి పెద్దదయింది. కాలంతా వ్యాపించింది. బొంబాయి లోని డాక్టర్లు కాలును పరిశీలించి కాలు తీస్తామంటే మత్తు మందు వద్దు అలాగే తీయండి అంటూ యోగనిద్రను బూని కాలు తీయించుకున్నారు. అనంతరం ఎలాంటి కర్ర లేకుండానే శిష్యుని సహాయంతో నడిచి వెళ్ళేవారు. కానీ 'సర్కస్' మూతపడింది. ఆర్థిక ఇబ్బందులెదురయ్యాయి – చలించలేదు.

ఆరోజు సంక్రాంతి పండుగ, జనవరి 16వ తేదీ 1942 సం?ము ఉదయం నిద్రలేచే రామ్మూర్తి గారు, ఆరోజు ఏడు గంటలైనను లేవలేదు. శిష్యునికి అనుమానం కలిగి గదిలోకి వెళ్ళి ఒంటిమీద చూసేసరికి శ్వాస ఆడడం లేదు. ప్రశాంతంగా దీర్ఘనిద్రలోకి వెళ్ళిపోయారు. ప్రపంచ స్థాయిలో తెలుగు జోదుని కీర్తిబావుటా నెగురవేసిన కోడి రామ్మూర్తి స్థాయికి ఎదిగిన వారెవరూ లేరు. కానీ ఇలాటి వ్యక్తికి టాంకుబండుపై శిలావిగ్రహం లేకపోవడం విచారకరం. రాజధాని మంచి కూడలిలోనే కాదు, నగర నగరాన ఇలాటి అభినవ భీమసేనుడు కోడి రామమూర్తి విగ్రహాన్ని నెలకొల్పడం, భావి తరాలకు తెలియచేయడం అవసరమని తెలియ చేస్తున్నాం. ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

*Compliments from*
**Sri Krishna Bhat**
*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

మనమందరం కష్టపడి శ్రమించాలి మనందరి కృషిపైన భావిభారత భాగ్యోదయం ఆధారపడి వుంది. - స్వామి వివేకానంద



## అమ్మే దైవం

తన బిడ్డలను కంటికి రెప్పలా చూసుకుంటూ ఎల్లవేళలా కాపాడేది తల్లి. తన స్వార్థాన్ని వీడి నిస్వార్థంగా పిల్లల పట్ల ప్రేమ చూపించేది తల్లి. తల్లి ప్రేమకు ఈ భువిలో వేరేది సాటిలేదు.

ఏప్రిల్ నెలలో మారమ్మ సత్యవతమ్మ గారిని గురించి నాలుగు మాటలు ముచ్చటిస్తూ వుంటారు. నాన్నగారది చూసి మనసులో పొంగిపోయినా, నేనంటే నీకు ప్రేమ లేదురా అని నవ్వుతూ అంటూ వుంటారు. మొదటిసారిగా ఇద్దరూ లేని తనం ఏదో వెలితిగా వుంటుంది. అంతా పోగొట్టుకున్నట్టు వుంది. 2015లో వరదలో ప్రెస్ మునిగిపోయినప్పటి బాధకన్నా ఎక్కువగా వుంది. వారున్నారనే ధైర్యం, భరోసా వుండేది. ఏవిటో అంతా అయోమయంగా వుంది. ప్రతి చిన్న విషయంలో వారి దగ్గరా సలహాకు వెళ్ళేవాడిని ఇప్పటికి నా బాధను అమ్మ ఫోటో ముందు చెప్పుకుంటూ వుంటాను. అమ్మను ఆరాధించటానికి ఎన్నో మార్గాలు, అమ్మను అమ్మగా, సకల దేవతామూర్తిగా, మనకు ఇష్టమైన రీతిలో, మనసుకు నచ్చినరీతిలో స్మరించవచ్చు.

సనాతన ధర్మం పట్ల, భక్తి విశ్వాసాలు వున్నవాడిని. అందుకే పైనుండి అమ్మనాన్నల దీవెనలు మా కుటుంబానికి, ముఖ్యంగా నాకు వుంటాయని అచంచలమైన విశ్వాసం కలవాడిని.

ఎక్కడో మారుమూల గ్రామం నుండి కట్టుబట్టలతో వచ్చి ఈ చెన్నై మహానగరంలో పిల్లలను పెంచి, చదివించి, వారినొక ఇంటివారిని చేసి, నిలువ నీడగా ఒక గూటినిచ్చి, అన్నటికన్నా ముఖ్యంగా ప్రేమానురాగాలు పంచి, మమ్మల్నింతవారిని చేసినవారిని స్మరించుకుంటూ వారికి అనంతకోటి ప్రణామాలను అందజేసుకుంటున్నాను.

✧ ✧ ✧

**జాతిపై గౌరవంబు నీతిపై నిలుచును**
**నీతిలేకయున్న జాతి చెడును**
**నీతిగల్గు జాతి నిజమైన జాతిరా**
**వినుము భారతీయ వీరసుతుడు** – అన్నారు సత్యసాయిబాబా వారు.

ప్రస్తుత కాలమాన పరిస్థితులకు దీనిని అన్వయించుకుంటే మనం నీతి తప్పుతున్నామేమో అనిపిస్తోంది. ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అంటూ తను, తన కుటుంబం అభ్యున్నతి చెందితే చాలు, ప్రజలందరూ గొర్రెలు, వారికో నాలుగు గింజలు రాల్చితే నోరు మూసుకుంటారు అన్నది ప్రస్తుత రాజకీయ వ్యవస్థ. ఏ రాష్ట్రం చూసినా కటుంబ పాలనే. ఆ కుటుంబ పాలన కోసం విలువలకు తిలోదకాలిచ్చి అడ్డదారులు తొక్కడమే ప్రస్తుత రాజకీయ నాయకుల కార్యాచరణ. ఎన్నికలు గెలిచి నాలుగున్నరేళ్ళు జనాలను పట్టించుకోకపోవడం, మళ్ళీ ఎన్నికలు గెలవవడం కోసం చివరి ఆరు నెలలలో ఆచరణసాధ్యం కాని ప్రమాణాలు చెయ్యడం. ప్రతి రాజకీయ నాయకుడి కుటుంబం అభివృద్ధి చెందినంతగా ఆ రాష్ట్రం అభివృద్ధి చెందలేదు. రాజకీయం వ్యాపారం అయిపోయింది. మార్పు రావాలి, ఎప్పుడొస్తుంది, ప్రజలు ప్రశ్నించినప్పుడే. ఎవరికి వారు మనకెందుకురా అనుకుంటే మార్పు రాదు. ప్రస్తుతం యువతరానికి చదువు, సంపాదన తప్ప ఇంకొకటి పట్టటం లేదు. కేవలం మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలు, వేతనాలు చూస్తున్నారే కాని దేశం ఏమైపోయినా వారికి అక్కరలేదు. మనందరం ఆత్మవిమర్శ చేసుకునే సమయం ఆసన్నమైంది. విద్యావంతులు విచక్షణతో ఆలోచించి నిర్ణయం తీసుకోకపోతే భారతదేశ ఔన్నత్యం, జాతి, ఐకమత్యం పూర్తిగా దెబ్బతింటుందనటంలో సందేహం లేదు. చేతులు కాలాక, ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు. కాబట్టి మన ధర్మాన్ని నిలబెట్టడానికి, మన పిల్లల భవిష్యత్తు బాగు చేసుకోవటానికి ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని కోరుకుంటున్నారు. అందుకు తగిన శక్తిసామర్థ్యాలను మనందరికి ఇవ్వమని ఆ సర్వేశ్వరుడిని కోరుకుంటున్నాను.

✧ ✧ ✧

## అనగనగా

**ఇలా నా చిన్నప్పుడు కథలు మొదలయ్యేవి.**

అనగనగా ఒక చెట్టుకి ఓ కుర్రాడికి స్నేహం కుదిరింది, రోజు ఆ కుర్రాడు చెట్టు దగ్గిరకొచ్చి పైకెక్కి కిందకు దూకి, దాని మెడకో తాడు కట్టి ఉయ్యాల ఆడుకునేవాడు. ఆటల్లో అలిసిపోయి కాసేపు ఆ చెట్టు నీడలో పడుకుని వెళ్ళేవాడు. చెట్టుకి కుర్రాడికి ఒకరంటే ఒకరికి ప్రేమ, బంధం పెరిగింది.

కొన్నాళ్ళకు కుర్రాడు పెద్దవాడయ్యాడు, మునుపటిలా చెట్టు వద్దకు రావటంలేదు, చెట్టుకి కాస్త బాధ కలిగింది.

కొంతకాలం తరువాత ఆ చెట్టు వద్దకు కుర్రాడొచ్చాడు, చెట్టు ఆనందంతో, రా ఆడుకుందాం అంది.

దానికా కుర్రాడు నేను పెద్ద వాడినయ్యాను, నాకు బొమ్మలు కావాలన్నాడు, దానికి డబ్బులు కావాలి నా దగ్గిర లేదు, ఓ పని చెయ్యి నా దగ్గిరున్న పళ్ళను కోసుకుని అవి అమ్ముకుని వాటితో బొమ్మలు కొనుక్కో అంది చెట్టు, ఉత్సాహంగా ఆ పనిని చేసేసి మళ్ళీ చెట్టుకి కనిపించకుండా పోయాడు, మళ్ళా కుర్రాడు కనిపించకుండ దిగులుపడింది చెట్టు.

మళ్ళీ కొంత కాలానికి దిగులు ముఖంతో వచ్చాడా కుర్రాడు. ఇప్పుడు ఎదిగిన యువకుడు చెట్టు ముఖంలో ఆనందం వర్ణాతీతం, దా ఎలా వున్నావ్, రా కాసేపు ఆడుకుందాం అంది చెట్టు.

దానికా కుర్రడు నేనింకా చిన్నపిల్లాడినేవిటి ఇప్పుడు యువకుడిని, నాకు ఆటకు సమయం లేదు, పైగా పెళ్ళయి పిల్లలు, వారి బాగోగులు చూడాలి, ఒక చిన్న ఇల్లు వుంటే బాగుంటుంది, నువ్వేదైనా సహాయం చెయ్యగలవా?

అంతే దిగాలుతో చెట్టు నా కొమ్మలు నరుక్కుని వాటితో ఇల్లు కట్టుకో అంది, ఆ కుర్రడి ముఖంలో ఆనందానికి అవధులు లేవు, సంతోషంగా చేతికి అందినంత వరకు నరుక్కుని వెళ్ళిపోయాడు, చాలా సంవత్సరాలు కనిపించలేదు, చెట్టుకి


Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

కుర్రాడెలా వున్నాడో అని ఆందోళన చెందింది.

కొంతకాలానికి మండువేసవిలో ఆ కుర్రాడు తిరిగొచ్చాడు, చెట్టుకి పట్టలేని సంతోషం, అంతటి వేసవిలోను చల్లని గాలినిస్తూ రా కాసేపు ఆడుకుందాం అంది చెట్టు. దానికా కుర్రాడు నేనిప్పుడు కుర్రాడినుండి, యువకుడు, యువకుడినుండి మధ్య వయస్కుడిని అయ్యాను. ఇప్పుడు ఆడే వయసుకాదు, నాకు ఒక పడవ ఇస్తే కాస్త నాలుగూర్లు తిరిగి వస్తాను సహాయం చెయ్యగలవా అని అడిగాడు.

దానికా చెట్టు నీకు పళ్ళు ఇచ్చాను, కొమ్మలిచ్చాను, ఇంక నా దగ్గిర పెద్ద కొమ్మ, పెద్ద దుంగ కోసి దానితో పడవ చేసుకుని షికారు చేసుకో అందా చెట్టు.

మళ్ళీ కొంతకాలం ఆ కుర్రాడు కనిపించలేదు, చెట్టు దిగాలు పడింది. బెంగ పెట్టుకుంది.

చాలా కాలం తరువాత దీన వదనంతో, నీరసంగా, బాధగా వచ్చాడు, అపుడా చెట్టు ఇలా ప్రారంభించింది

బాబు ఇప్పుడు నీకివ్వడానికి పళ్ళు, కొమ్మలు నాదగ్గిర లేవు, నేను కాస్త వంగిపోయాను.

దానికా మనిషి నాకిప్పుడేమి వద్దు, నాకు కావలసినదల్లా సేద తీర్చుకోడానికి ఒక చోటు, నేను ఆట పాటలతో అలసిపోయాను ఇప్పుడు నాకెవరూ లేరు అన్నాడు.

ఆ చెట్టు కుర్రాడిని అక్కున చేర్చుకుని రా నా వేర్లు వున్నాయి, చల్లగా అక్కడ కూర్చో, నా ఒడిలో సేద తీర్చుకో. మనిద్దరం చిన్నప్పటినుంచి ఆడుతూ, పాడుతూ కేరింతలతో కాలం గడిపాం, నీ కష్టం నా కష్టం అంటూ కన్నవారిలా ఒదార్చింది, అక్కున చేర్చుకుంది.

ఈ కథ విన్నాక ఆ కుర్రాడెంత క్రూరుడో అనిపిస్తోంది కదా!

తరవాతేం జరిగింది అంటున్నారా?

ఈ కథ విన్నట్టుందా, ఇంకా అనుమానమెందుకో విన్నదే, ఇది మనందరి కథే? ఆ చెట్టు మన తల్లిదండ్రులే, ఆ చెట్టుని కుర్రాడు వాడుకున్నట్టు వారిని వాడుకుని, వారికి అవసరం వచ్చినపుడు వారికి ఉపయోగపడకుండా, వారి జవసత్వాలు ఉడిగిపోయినప్పుడు కూడా వారు మనకుపయోగపడతారా అని ఆలోచించే పిల్లలు, వారిని గాలికొదిలేసి పట్టించుకోని పిల్లలు, వేరే వూర్లలో వుంటూ కావలసి వస్తే డబ్బులు పంపిస్తామనే పిల్లలు వున్నా ఒకటే లేక పోయినా ఒకటే.

మీకోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన కన్నవారిని, మీరే వారి జీవితం అనుకుంటున్న పెద్దవారిని పట్టించుకోకపోతే మీ పాపానికి నిష్కృతిలేదు, మా సోదరి ఒకరు పాపం చేసి ఏకాదశి నాడు పోతే స్వర్గమా అని? పొద్దున్న అడిగారు, పెద్దల్ని క్షోభ పెట్టిన పాపం ఏడేడు జన్మలకు పోదు.

✧ ✧ ✧

**భా**రతదేశం ఒక అద్వితీయ దేశం. ఎన్నో విదేశీ దండయాత్రలకు గురైనా తనదైన సంస్కృతిని నిలబెట్టుకుంటుంది. తన ఉనికిని పోగొట్టుకోలేదు. ఐదు వేల ఏళ్ళచరిత్రలో ఎప్పుడు భారతదేశం తనకు తానుగా ఏ దేశంపైనా దండయాత్ర చెయ్యలేదు. ప్రపంచం మన మాతృభూమికి ఎంతో ఋణపడి వుంది. ప్రతి దేశం క్షమామయుడైన హిందువుకు ఋణపడినంతగా మరే జాతికి ఋణపడి లేదు. గ్రీకు దేశం పుట్టకముందు నుంచి, రోమ్ నగరాన్ని ఊహించక ముందునుండి ఐరోపా జాతుల వారు అడవుల్లో తిరుగుతున్న కాలంలోనే భారతదేశం నుంచి ధర్మప్రచారాలు సాగాయి. మనదేశ పురాణగాథల్లో ప్రతి మాట ముందర ఒక శాంతి సందేశం, ప్రతి వాక్కూ ఒక అనుగ్రహపూర్వకంగా పలికాయి. సామరస్య భావం గురించి, మనిషిలోని దివ్యత్వం గురించి మన భారతదేశం కొన్ని వేల ఏళ్ళకు ముందే గుర్తించింది.

అటువంటి భారతదేశాన్ని, దాని సంస్కృతి, సాంప్రదాయాన్ని దైవం పట్ల వున్న విశ్వాసాన్ని ముఖ్యంగా హిందూ జాతిని నాశనం చెయ్యడానికి కుట్ర జరుగుతూ వుంటే, మనకి ఏమి పట్టనట్టు వూరుకొన్నాం. ఒకప్రక్క అన్యమత ప్రచారం జరుగుతోందని తెలిసినా, లేదని బుకాయిస్తున్నాం. అయ్యప్ప భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసినా వూరుకున్నాం. మరోప్రక్క హిందు జాతిని బాంబులు పెట్టి చంపుతూ (బొంబాయిలో) కాశ్మీర్‌లో హిందు కుటుంబాల్ని మాత్రమే హతమారుస్తూ వుంటే అందరం నోరుమూసుకుని వూరుకొన్నాం. హిందువులందరికీ ఇది దుర్దినాలు. బ్లాక్ డే (చీకటి రోజులు) అని చెప్పవచ్చు. శంకరాచార్యులు వారు చెప్పినట్లు "దుర్బలాన్ అజితేంద్రియాన్ ప్రాప్య యోగో నష్టః" అంటే ధర్మం అనేది ఆచరణశూన్యులు, అజితేంద్రియులు (అంటే సంయమనం లేనివారు) దుర్బలులు చేతిలో పడి నశిస్తోంది. దీనిని సమాజంలోని ఏ పెద్దలు నోరు తెరిచి గర్హించకపోవడం ఆశ్చర్యం. అవమానకరం. వారు ఎంత పెద్దవారలైనా సరే వారి పేరుకి వెనుక ఎన్ని పట్టాలు (డిగ్రీలు) వున్నా, ఎన్ని హోదాలు వున్నా, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామిజీలు ఎందరుండి ఏం లాభం వారందరు ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతున్నప్పుడు కౌరవ సభలోని నోరు మెదపని భీష్మ, ద్రోణాచార్యులకు సమమే.

రాయప్రోలు సుబ్బారావు గారన్నట్లు

**ఏ పూర్వపుణ్యమో ఏ యోగ బలమో**
**జనియించినాడు నీ స్వర్గ ఖండమున**
**ఏ మంచి పూవులన్ ప్రేమించినావో**
**నిను మోచె ఈ తల్లి కనక గర్భమున.**

ఇటువంటి ఈ స్వర్గభూమిలో జన్మించి ఆ భారతమాత గర్వించేలా జీవించాలి కాని, ఆ తల్లి మనస్సు నొప్పింప కూడదు.

ఎవరికి లేని బాధ నీకెందుకు అని నన్ను అందరూ వారిస్తున్నా, నా మనసులోని మాట వ్రాయక తప్పటం లేదు. ●

# ప్రముఖాంధ్ర రజతోత్సవ సంచికకు ఎదురుచూడండి

**ఈ 2019వ సంవత్సరంలో ప్రముఖాంధ్రకు 24 ఏళ్ళు పూర్తయ్యి 25వ సంవత్సరంలోకి అడుగిడింది. ఈ సందర్భంలో ఒక ప్రత్యేక సంచికను తీసుకురావాలని సంకల్పించాం. శ్రీగోటేటి శ్రీరామారావుగారి మానస పుత్రిక, ఆయన నిరంతరం శ్రమించి వయోభారాన్ని కూడా లెక్కచెయ్యకుండా ఆయన తెలుగువారి పట్ల, తెలుగు భాష పట్ల పడిన తపన, తపః ఫలమే ఈ ప్రముఖాంధ్ర. రజతోత్సవ ప్రత్యేక సంచికకు ప్రముఖాంధ్రుల విశేషాలను త్రిలింగదేశంలో విరాజిల్లిన ధార్మిక సంస్కృతిని, విపులంగా, మే మెరిగినంత విశదంగా, చిత్తరువులతో మీమీ అమూల్య రచనలను, ఈ 24 సంవత్సరాలలో ప్రముఖాంధ్రలో మీరు పొందిన అనుభవాలు పంపించండి. అంతేకాదు మీరు కూడా చందాదారులుగా రూ.2116ను పంపిస్తూ మీరు మరొక్కరిని ఇంకో రూ.2116లను చేర్పించగలరని ఆశిస్తున్నాను. ప్రపంచమంతా ప్రముఖాంధ్రుల మయం కావాలి. ప్రముఖాంధ్ర తేజం ప్రపంచమంతటా వెల్లివెరియాలి.**